




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 16 మంగళవారం మార్చి 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 180
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal, Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







## కేసీఆర్ వందేళ్లు ప్రతిపక్షంలోనే..



- ఆకాంక్ష వ్యక్తం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ అసెంబ్లీకి వచ్చింది 2 రోజులే..తీసుకున్న జీతం రూ.57 లక్షలు
- 2022లో గవర్నర్ ప్రసంగం లేకుండా అసెంబ్లీ సమావేశం
- మహిళా గవర్నర్‌ను అవమానించిన అప్పటి సీఎం కేసీఆర్
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

భారత రాజ్యాంగ స్ఫూర్తితోనే మనమా వ్యవస్థలను నడుపుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ ప్రసంగించారు. 2022 బడ్జెట్ సమావేశాల్లో గత ప్రభుత్వం గవర్నర్ ప్రసంగం లేకుండానే సమావేశాలు నిర్వహించారని.. మహిళా గవర్నర్‌ను అవమానించేలా వ్యవహరించారని సీఎం విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వ్యవస్థలను సంస్థలను గౌరవించుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. అజ్ఞానాన్నే విజ్ఞానం అనుకుంటున్నారు.. సీనియర్లమని, పదేళ్లు మంత్రులుగా చేసినమని చెప్పుకునేవాళు గవర్నర్ ప్రసంగాన్ని తప్పుబట్టారని.. వాళ్ల వారి అజ్ఞానాన్నే తమ విజ్ఞానమని అనుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. మంత్రివర్గం ఆమోదం పొందిన అంశాలనే గవర్నర్ తమ ప్రసంగంలో వినిపించారన్నారు. ఎలక్షన్ మేనిఫెస్టోలోని అంశాలను ప్రభుత్వంలో అమలు చేస్తున్నామన్నారు. మేం అమలు చేసే వాటినే మంత్రివర్గం ఆమోదించి గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచామని సీఎం చెప్పారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే గవర్నర్ ప్రసంగం కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ఉండదన్నారు. పదేళు పాలించినవారు మంత్రివర్గం ఆమోదం లేకుండానే గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచారా అంటూ ప్రశ్నించారు. వాళ్లకు గవర్నర్ పై గౌరవం లేకనే మహిళను అవమానించారన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం.. మేం రాజ్యాంగబద్ధంగా వ్యవస్థను గౌరవిస్తామన్నారు. ఆ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే.. సభ్యులు ప్రస్తావించిన అంశాలన్నీ దృష్టిలో

## ట్రంప్ ట్రావెల్ బ్యాన్!

- ట్రంప్ మరో సంచలన నిర్ణయం
- పాక్ సహా 41 దేశాలపై ట్రావెల్ బ్యాన్!
- 42 దేశాలలో పాకిస్థాన్, ఆఫ్ఘన్, భూటాన్ దేశాలు
- ఇటీవల కాలంలో పాక్-యుఎస్ మధ్య ఉద్రిక్తతలు

2



**వాషింగ్టన్-నవభూమిబ్యూరో**

దూకుడు పాలన కొనసాగిస్తున్నఅమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. అక్రమ వలసలపై ట్రంప్ కఠిన చర్యలు మరింత తీవ్రమవుతున్నాయి. పాకిస్థాన్ సహా 41 దేశాలపై ప్రయాణ నిషేధం విధించడానికి పూర్తి సన్నాహాలు చేసిన ముసాయిదాను అమెరికా ప్రభుత్వం సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ సారి ప్రయాణ ఆంక్షలు మరింత సమగ్రంగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ట్రంప్ తన మొదటి పదవీకాలంలో ఏడు ముస్లిం-మెజారిటీ దేశాల ప్రయాణికులను నిషేధించారు. రాయిటర్స్ ప్రకారం.. అమెరికా కు ప్రయాణించకుండా ట్రావెల్ బ్యాన్ చేయబడుతున్న 42 దేశాలలో పాకిస్థాన్, ఆఫనిస్తాన్, భూటాన్ ఉన్నాయి. అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ దూకుడు పాలన అక్రమ వలసలను అరికట్టడానికి కృషి చేస్తోంది. ప్రయాణ నిషేధం జాబితాలో ఉన్న దేశాలలో తుర్కెమెనిస్థాన్, బెలారస్, భూటాన్, వనువాటు ఉన్నాయి. ఇటీవల ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోడీ పౌరసత్వం పొందానని చెప్పిన వనువాటు కూడా ఉండడం గమనార్హం. అంతకు ముందు పాకిస్థాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రయాణ నిషేధ వార్తలను ఊహాగానాలుగా తోసిపుచ్చింది. పాకిస్థాన్‌కు అటువంటి ఆంక్షల గురించి ఎటువంటి అధికారిక సూచనలు అందలేదని విదేశాంగ కార్యాలయ ప్రతినిధి షఫ్కత్ అలీ ఖాన్ అన్నారు. ప్రస్తుతానికి ఇవన్నీ ఊహాగానాలు మాత్రమేనని.. అందువల్ల దీనిపై స్పందించాల్సిన అవసరం లేదని షఫ్కత్ అలీ ఖాన్ పేర్కొన్నారు.

## తెలంగాణకు మరో యునెస్కో గుర్తింపు



- నిలువు రాళ్లకు యునెస్కో వారసత్వ జాబితాలో చోటు
- నారాయణపేట జిల్లాలోని ముడమాల్ నిలువురాళ్లు
- మెగాలిథిక్ మెన్‌హిర్లు సుమారు 3,500 నుంచి 4,000 ఏళ్ల నాటివి
- భారత్ నుంచి యునెస్కో తాత్కాలిక జాబితాలో నిలుపురాళ్లు

2


**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

యునెస్కో వారసత్వ జాబితాలో తెలంగాణలోని రామప్ప ఆలయం 2021లో చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు నారాయణపేట జిల్లాలోని ముడమాల్ నిలువురాళ్లు ఆ జాబితాలో చోటు దక్కించుకునేందుకు ఓ అడుగుదూరంలో ఉన్నాయి. తెలంగాణలోని నారాయణపేట జిల్లాలోని ముడమాల్ మెగాలిథిక్ మెన్‌హిర్లు లేదా నిలబడి ఉన్న రాళ్లు సుమారు 3,500 నుంచి 4,000 సంవత్సరాల నాటివి. భారత్ నుంచి యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల తాత్కాలిక జాబితాలో చేర్చబడ్డాయి. భవిష్యత్‌లో యునెస్కో గుర్తింపు కోసం నామినేట్ చేయాలనుకుంటున్న ముఖ్యమైన వారసత్వ ప్రదేశాల జాబితాగా ఈ తాత్కాలిక జాబితా పని చేస్తుంది. యునెస్కో వారసత్వం ట్యాగ్ కోసం స్థలాన్ని పరిగణించే ముందు తాత్కాలిక జాబితాలో చేర్చడం తప్పనిసరి దశ కావడం గమనార్హం. ముడమాల్ నిలువు రాళ్లు ఆదిమ మానవుల ఖగోళ పరిజ్ఞానానికి నిలువెత్తు నిదర్శనమని పరిశోధకలు చెబుతున్నారు. శిలాయుగంలో వాతావరణ మార్పులు, రుతువులు, కాలాలను గుర్తించడానికి ఆదిమ మానవులు వీటిని ఏర్పాటు చేసుకున్నట్లు తెలుపుతున్నారు. ముడమాల్

## ప్రధాని చేతుల మీదుగా అమరావతి రీ లాంఛ్



- ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి నిర్మాణ పనులు
- ప్రధానితో భేటీ అయి అమరావతికి ఆహ్వానించనున్న సీఎం
- అమరావతి పనుల ప్రారంభ ఘట్టం అట్టహాసంగా నిర్వహించాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం



2

**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీ రాజధాని అమంతి కేంద్రంగా కీలక నిర్ణయాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొత్త రాజధాని అమరావతి విష యంలో వ్యూహాత్మక నిర్ణయాలు అమలు చేస్తోం ది. ఇప్పటి వరకు ఆర్థిక వనరుల సమీకరణ పైన ఫోకస్ చేసిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు నిర్మాణాల పైన కసరత్తు చేస్తోంది. పలు నిర్మాణాలకు టెండర్లు ఖరారు చేసింది. ఇక, కీలకమైన ఐకానిక్ టవర్స్ టెండర్లు పిలిచేందుకు సిద్దమైంది. ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది.అమరావతికి ప్రధాని అమరావతి పనుల రీ లాంఛ్ కోసం ప్రధాని మోదీని ఆహ్వానిం చాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఇదే అంశం పైన ఢిల్లీ పర్యటనలో చర్చించారు. ఈ నెలాఖరులో ఢిల్లీ వెళ్లనున్న చంద్రబాబు.. ప్రధానితో భేటీ అయి అమరావతికి ఆహ్వానించనున్నారు. అమరావతి పనుల ప్రారంభ ఘట్టం అట్టహాసంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. నవనగరాల నిర్మా ణంలో భాగంగా ప్రధానితో ఆ సిటీలకు శంకుస్థాపన చేయించనుంది. ఏప్రిల్ మూడో వారంలో ప్రధాని అమరావతికి వచ్చే అవకాశం ఉందని. ఇక, టెండర్లు పూర్తయిన వాటి నిర్మాణాలకు షెడ్యూల్ ఖరారు చేస్తోంది. ఐకానిక్ భవనాల కోసం అమరావతి

## కొమ్మాల జాతరలో ఉద్రిక్తత

- కొమ్మాల జాతర సందర్భంగా ప్రభ బండ్ల ప్రదర్శన
- పోటాపోటీగా కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీనేతల ప్రభ బండ్లు
- ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం
- ఇరు పార్టీల కార్యకర్తలు బాహాబాహికి దిగడంతో
- లాఠీచార్జి చేసి ఆందోళనకారుల్ని చెదరగొట్టిన పోలీసులు
- పోలీసుల తీరును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధర్నా



2



**వరంగల్-నవభూమిబ్యూరో:** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద శనివారం నాడు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. కొమ్మాల జాతరను పురస్కరించుకొని ప్రభ పండ్లను ప్రదర్శనగా తీసుకొని వెళుతున్న క్రమంలో బిఆర్ఎస్ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రభలు, కాంగ్రెస్ పార్టీ ప్రభ బండ్ల ప్రదర్శన ఉద్రిక్తతలకు కారణమైంది. కొమ్మాల జాతరలో ఉద్రిక్తత వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల జాతరను పురస్కరించుకొనీ రాజకీయ పార్టీలు ప్రభ బండ్ల ప్రదర్శనను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాయి. అయితే దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా ప్రదర్శన నిర్వహించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఇరు పార్టీల కార్యకర్తలు బాహాబాహికి దిగడంతో పోలీసులు లాఠీచార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ధర్నా ఇక పోలీసుల తీరును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ధర్నాకు దిగారు. అధికార పార్టీకి అండగా ఉండి, కావాలని బీఆర్ఎస్ నాయకులపైన లాఠీచార్జి చేశారని మండిపడ్డారు. ఇదిలా ఉంటే కొమ్మాల జాతరలో పోలీసులు కాల్పులు జరిపారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. సోషల్ మీడియాలో, మీడియాలో పలువురు దీనిపైన వార్తలు రాస్తున్నారు. దీంతో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ స్పందించారు. పోలీసుల కాల్పుల పైన వరంగల్ సీపీ క్లారిటీ కొమ్మాలలో జరిగిన ఘర్షణకు సంబం ధించిన వివరాలను వెల్లడించి పోలీసుల కాల్పు ల పైన క్లారిటీ ఇచ్చారు. వరంగల్ జిల్లాలో కొమ్మాల జాతర సందర్భంగా ఈ రోజు ప్రభల ను

## నాగబాబుకు మంత్రిపదవి?

- ముందే ప్రకటించిన సీఎం చంద్రబాబు
- ఇప్పటికే ఇద్దరు జనసైనికులకు మంత్రిపదవులు
- నాగబాబు మంత్రి పదవి లభించిన మూడో వ్యక్తి
- సినిమాటోగ్రఫీ,టూరిజం శాఖలు అప్పగించే ఛాన్స్

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. జనసేన సభపైన మిశ్రమ స్పందన కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మది నెలలు పూర్తయింది. బీజేపీ కూటమి పైన పట్టు బిగించే ప్రయత్నం చేస్తోంది. తాజా జనసేన సభలో పవన్, నాగబాబు చేసిన వ్యాఖ్యలు టీడీపీ నేతలకు రుచించటం లేదు. ఇదే సమయంలో మెగా బ్రదర్ నాగబాబు ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. ఇక,

## ముస్లిం కాంట్రాక్టర్లకు 4 శాతం రిజర్వేషన్లు

- కర్ణాటక సర్కార్ కీలక నిర్ణయం
- సర్కార్ నిర్ణయంతో భగ్గుమన్న బీజేపీ
- ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్న కేటీపీపీ సవరణ చట్టం

2



**బెంగుళూరు-నవభూమిబ్యూరో**

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సారథ్యంలో కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. ప్రభుత్వ టెండర్లలో ముస్లిం కాంట్రాక్టర్లకు నాలుగు శాతం రిజర్వేషన్లను కల్పించబోతోంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఆ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ఈ చర్య పట్ల భారతీయ జనతా పార్టీ భగ్గుమంటోంది. ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వ టెండర్ల ప్రక్రియలో రిజర్వేషన్లను కల్పించడానికి ప్రస్తుతం అమలులో ఉన్న కర్ణాటక పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ (కేటీపీపీ) చట్టాన్ని సవరించాల్సి ఉంది. దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది మంత్రివర్గం. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే

## గుంటూరు మేయర్ కావటి రాజీనామా

- జిల్లా కలెక్టర్‌కు రాజీనామా పత్రం
- కార్పొరేషన్‌లో తనకు తీవ్ర అవమానం
- ఎదురవుతోందని మేయర్ కావటి ఆవేదన
- పార్టీ మారే యోచనలేదని స్పష్టీకరణ



**గుంటూరు-నవభూమిబ్యూరో**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కావటి మనోహర్ నాయుడు తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజీనామా చేయడానికి గల కారణాలను వెల్లడించారు. కార్పొరేషన్‌లో తనకు తీవ్ర అవమానం ఎదురవుతోందని కావటి మనోహర్ నాయుడు అన్నారు. ఈ అవమానాలు, నిందలు, పరాభవాలను ఎదుర్కొనే ఆత్మస్థైర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎదుర్కొన్నటువంటి అవమానాలు, పరాభవాలు కార్పొరేషన్ చరిత్రలో ఏ మేయర్ గానీ, ఏ ఛైర్మన్ గానీ అనుభవించి ఉండరని వాపోయారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదని కోరుకుంటున్నానని మనోహర్ నాయుడు చెప్పారు. పార్టీ మార్పుపైనా మనోహర్ నాయుడు తేల్చి చెప్పారు. పార్టీ మారే ప్రసక్తే లేదని అన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగంలో ఎన్ని కష్టాలు పెట్టినా వైఎస్ జగన్‌తోనే ఉంటానని ప్రకటించారు. 2021లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ పార్టీ నుంచి మేయర్ కావటి మనోహర్ నాయుడు ఎన్నికయ్యారు. ఇంకో ఏడాద కాలం పాటు ఆయన ఆ పదవిలో కొనసాగాల్సి ఉంది. ఈలోపే ఆయన తప్పుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆయన రాజీనామాకు ప్రధాన కారణం- కార్పొరేషన్ స్టాండంగ్ కమిటీ వ్యవహారశైలేనని చెబుతున్నారు. కొందరు వైఎస్ఆర్సీపీ కార్పొరేటర్లు తెలుగుదేశం, జనసేన తీర్థం పుచ్చుకోవడం వల్ల స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు ఆ రెండు పార్టీలకే దక్కాయి. ఈ కమిటీకి మేయరే ఛైర్మన్‌గా వ్యవహరిస్తోన్నారని, ఆయినప్పటికీ- ఆయనకు సమాచారం ఇవ్వట్లేదని తెలుస్తోంది.అదే సమయంలో ఈ నెల 17వ తేదీన స్టాండింగ్ కమిటీ సమావేశం జరుగబోతోంది. స్టాఇందులో కావటి మనోహర్ నాయుడిపై అవిశ్వాసం తీర్మానం సైతం ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. స్టాండింగ్ కమిటీలో మెజారిటీ స్థానాలు లేకపోవడం వల్ల ఈ తీర్మానం నెగ్గడం లాంఛనప్రాయమేనని, అందుకే కావటి రాజీనామా చేశారని అంటున్నారు. స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఈ సమావేశాన్ని ఎప్పుడు, ఎక్కడ నిర్వహించాలనే నిర్ణయాధికారం మనోహర్ నాయుడికే ఉంటుంది. ఆ ప్రొటోకాల్‌ను సైతం అధికారులు పాటించట్లేదని ఆయన చెప్పారు. తన ప్రమేయం లేకుండా స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఏర్పాటు చేస్తోన్నారని పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు.

## బంగారం స్మగ్లింగ్ కేసులో తెలుగు నటుడు

- పరిచయం సినిమా హీరో విరాట్ కొండూరు రాజ్
- విరాట్ రన్యారావుకు అత్యంత సన్నిహితుడు
- తరుణ్‌ను అదుపులోకి ప్రశ్నిస్తున్న డీఆర్ఐ అధికారులు
- స్మగ్లింగ్ ముఠాతో సంబంధలున్నాయనే అనుమానం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

బంగారం అక్రమ రవాణాకు సంబంధించిన పెద్ద నెట్‌వర్క్ ను బట్టబయలు చేస్తూ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ ఇటీవల కన్నడ నటి రన్యా రావును అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ కేసులో రన్యా రావు స్నేహితుడు నటుడు తరుణ్ రాజ్ అలియాస్ విరాట్ కొండూరు రాజ్ పాత్రపై కూడా దర్యాప్తు జరుగుతోంది. డీఆర్ఐ అధికారులు తరుణ్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడం ప్రారంభించారు. మూడు తెలుగు చిత్రాలలో ప్రధాన పాత్రలు పోషించిన తరుణ్ కూడా ఈ స్మగ్లింగ్ ముఠాతో సంబంధం కలిగి ఉన్నాడని అనుమానుస్తున్నారు. అదే

## కస్టడీలో శారీరకంగా వేధించారు..

- రన్యారావు తీవ్ర ఆరోపణలు
- డీఆర్ఐ అధికారులు చెంపదెబ్బ కొట్టారు
- ఆహారం ఇవ్వకుండా నిలబెట్టారు
- ఖాళీ పత్రాలపై సంతకాలు చేయమని ఒత్తిడి



2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యా రావు మరోసారి డీఆర్ఐ అధికారులపై తీవ్ర ఆరోపణలు చేశారు. విచారణ సమయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్అధికారులు తనను చాలా సార్లు చెంపదెబ్బ కొట్టారని.. తనకు ఆహారం ఇవ్వలేదని.. ఖాళీ పత్రాలపై సంతకం చేయాలని బలవంతం చేశారని రన్యా ఆరోపించింది. డీఆర్ఐ అదనపు డైరెక్టర్ జనరల్ కు రాసిన లేఖలో.. రన్యా తాను నిర్ధోషినని ప్రకటించుకుని.. తనను తప్పుడు కేసులో ఇరికించారని పేర్కొన్నారు. కన్నడ నటి, సీనియర్ పోలీసు అధికారి కుమార్తె రన్యా రావును మార్చి 4న బెంగళూరులోని కెంపెగౌడ



# మా పథకాలకు కొత్త పేర్లు పెట్టి మసిపూసి మారేడుకాయ



**చెన్నై- నవభూమి:** అచరణకు సాధ్యం కాని ప్రకటనలతో బడ్జెట్ అంతా మోసపూరితంగా వుందని, గతంలో తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకే కొత్తగా పేర్లు పెట్టి మసిపూసి మారేడు కాయ చేశారని మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ధ్వజమెత్తారు. అసెంబ్లీలో శుక్రవారం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం అసెంబ్లీ బయట ఎడప్పాడి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి తంగం తెన్నరసు ఆచరణకు సాధ్యం కాని ప్రకటనలతో మాత్రమే బడ్జెట్ సరిపెట్టారన్నారు.ముఖ్యమంత్రి స్టాలిన్ 95శాతం హామీలను నెరవేర్చినట్లు ప్రకటించారని, అయితే 40శాతం హామీలు ఇంకా అలాగే వున్నాయని విమర్శించారు. నీట్ రద్దు చేస్తామని, అందుకు సంబంధించిన రహస్యం తమ వద్ద వుందని పలు వేదికలపై ప్రకటించిన ఉపముఖ్యమంత్రి ఉదయనిధి తన మాట నిలబెట్టుకోకుండా విద్యార్థులకు ద్రోహం తలపెట్టారన్నారు. ఉపాధి హామీ పథకాన్ని 150 రోజులుగా పెంచుతామన్న హామీ ఏమైందని ఈపీఎస్ ప్రశ్నించారు.గత 73ఏళ్ళలో రాష్ట్రప్రభుత్వం పొందిన అప్పు రూ.5లక్షల 18వేల కోట్లు మాత్రమేనని అయితే, డీఎంకే ప్రభుత్వం ఈ నాలుగేళ్ళలో రూ.3లక్షల 54వేల కోట్లు రుణం పొందిందని, దేశంలోనే అధిక రుణాలు పొందే రాష్ట్రంగా తమిళనాడు నిలిచిందని ఈపీఎస్ ఆరోపించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో వుంచుకుని రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో కొత్త పథకాలంటూ ఏమీ లేవన్నారు.

## బీజేపీ నేతను కాల్చి చంపిన పొరుగు వ్యక్తి




**చండీగఢ్-నవభూమి:** పొరుగింటికి చెందిన వ్యక్తి బీజేపీ నేతను కాల్చి చంపాడు. ఆయనను వెంబడించగా ఒక షాపులోకి వెళ్లాడు. అక్కడ గన్‌తో కాల్పులు జరిపి బీజేపీ నేతను హత్య చేశాడు. ఈ హత్యకు భూవివాదం కారణమని పోలీసులు తెలిపారు. బీజేపీ పాలిత హర్యానాలో ఈ సంఘటన జరిగింది. సోనిపట్‌కు చెందిన బీజేపీ నేత సురేంద్ర జవహర్, పొరుగింటికి చెందిన మోను బంధువుల నుంచి భూమిని కొనుగోలు చేశాడు. నాటి నుంచి భూమి విషయంలో వారిద్దరి మధ్య వివాదం నెలకొన్నది. ఈ నేపథ్యంలో ఆ భూమిలోకి అడుగుపెట్టవద్దని సురేంద్రను మోను హెచ్చరించాడు.కాగా, భూ వివాదాన్ని పరిష్కరించుకునేందుకు బీజేపీ నేత సురేంద్ర జవహర్ ప్రయత్నించాడు. శుక్రవారం రాత్రి ఆ భూమి వద్దకు ఆయన వెళ్లాడు. అయితే మోను దీనిపై ఆగ్రహించాడు. సురేంద్రపై గన్ ఎక్కుపెట్టాడు. దీంతో ఆయన భయంతో అక్కడున్న ఒక షాపులోకి పరుగులు తీశాడు.మరోవైపు సురేంద్రను మోను వెంబడించాడు. షాపులోకి ప్రవేశించిన అతడ్ని అడ్డుకునేందుకు అక్కడున్న ముగ్గురు వ్యక్తులు ప్రయత్నించారు. అయినప్పటికీ చేతిలోని గన్‌తో సురేంద్ర తలపై మోను కాల్పులు జరిపాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించారు.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సురేంద్ర జవహర్ మృతదేహన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయనను హత్య చేసిన నిందితుడు మోనును శనివారం ఉదయం అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు షాపులోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## ఓటరు-ఆధార్ కార్డు సీడింగ్‌పై సీఈసీ చర్చలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఓటరు ఐడీల్లో అవకతవకలు జరుగుతున్నట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆ సమస్యను పరిష్కరిం చేందుకు భారత ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమాం కీలక నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, లెజిస్లేటివ్ సెక్రటరీతో పాటు యూఐడీఏఐ సీఈవోతో భేటీకానున్నారు. ఓటరు ఐడెంటిటీ కార్డును.. ఆధార్ కార్డుతో అనుసంధానం చేయాలన్న అంశంపై చీఫ్ ఎలక్షన్ కమీషనర్ నిర్ణయం తీసుకోనున్నారు.ఎలక్టోరల్ డేటాలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టే ఆలోచనతో ఓటరు-ఆధార్ కార్డు సీడింగ్ గురించి చర్చించనున్నారు. అయితే వాలంటరీ పద్ధతిలో ఆధార్ డేటాబేస్‌తో ఓటరు ఐడీలను సీడింగ్ చేసే అవకాశం ఇప్పటికే ఉన్నది. కానీ అక్రమాలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో.. ఈ ప్రక్రియను కచ్చితంగా పాటించే రీతిలో చర్యలు చేపడుతున్నారు. ఉడాయ్ సీఈవోను కూడా చీఫ్ ఎన్నికల అధికారి ఈ అంశంపై కలవనున్నారు.ఇటీవల ముగిసిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో .. ఓటరు రోల్స్‌లో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు బీజేపీ ఓటర్ జాబితాలను మార్చేసినట్లు ఆమ్ ఆద్మీ ఆరోపించింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితా నుంచి పేర్లను ఈసీఐ తొలగించినట్లు కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

## భార్యను కాదని ఆమె వద్దకు వెళ్లాడు.. కట్ చేస్తే బిగ్ ట్విస్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:**సోషల్ మీడియా జనాలకు ఎంతగా ఉపయోగపడుతోందో.. అంతకు మించి అనర్థాలకు దారి తీస్తోంది. సోషల్ మీడియా ద్వారా అవుతున్న పరిచయాలు దారుణాలకు తెర తీస్తున్నాయి. పెళ్లి కాని వారి సంగతి పక్కన పెడితే.. పెళ్లయిన వారు కూడా తప్పుడు బంధాల్లో ఇరుక్కుపోతున్నారు. కొత్త పరిచయాలతో ప్రాణాలు కోల్పోతున్నారు. సోషల్ మీడియా కారణంగా ఏర్పడ్డ అక్రమ సంబంధాల వల్ల దేశ వ్యాప్తంగా నిత్యం ఎవరో ఒకరు బలవుతూనే ఉన్నారు. ఇదే కోవలో తాజాగా, కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పదంగా చనిపోయాడు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం అయిన ఓ మహిళ కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. భార్యను కాదని, ప్రియురాలి కోసం సాహసం చేయటం విషాదంగా ముగిసింది. ప్రియురాలే ఆస్తి కోసం అతడి ప్రాణాలు తీసేసిందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.భార్యను కాదని ప్రియురాలి కోసం..మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దొరైస్వామి అలియాస్ సూర్యది మైసూరు తాలూకాలోని అనుగనహళ్లి గ్రామం. ఇతడికి ఆరు సంవత్సరాల క్రితం హింకల్‌కు చెందిన దీపికతో పెళ్లయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సూర్యకు కొన్ని నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా శ్వేత అనే మహిళ పరిచయం అయింది. కొన్ని నెలలకు ఆ పరిచయం కాస్తా అక్రమ సంబంధానికి దారి తీసింది. ఈ విషయంలో సూర్య, దీపికల మధ్య గొడవలు జరిగేవి. అతడు భార్యను బాగా కొట్టేవాడు. బరితెగించి శ్వేతను నేరుగా ఇంటికే తీసుకువచ్చేవాడు. అంతటితో ఆగకుండా.. శ్వేతతో కలిసి దిగిన ఫొటోలను తన స్టేటస్‌లలో పెట్టేవాడు. సూర్య ప్రవర్తన రోజు రోజుకు దారుణంగా తయారు అవ్వటంతో దీపిక, సూర్య తల్లి పుష్ప వేరే ఇల్లు తీసుకుని అందులోకి షిఫ్ట్ అయ్యారు. సూర్య మాత్రం శ్వేతతో ఎంజాయ్ చేస్తూ ఉండేవాడు. వీరి వ్యవహారం ఎక్కువ కాలం సాఫీగా సాగలేదు.శ్వేత డబ్బు కోసం సూర్యను ఇబ్బందిపెడుతూ ఉండేది. ఆస్తి అమ్మి తనకు డబ్బులు ఇవ్వమనేది. శ్వేత మాటలు విని సూర్య తన భార్య తల్లిని ఇబ్బందిపెట్టేవాడు. ఆస్తి అమ్మాలంటూ బలవంతం చేసేవాడు. కానీ, వారు మాత్రం ఆస్తి అమ్మడానికి ఒప్పుకోలేదు. ఆస్తి అమ్మడానికి ఒప్పుకోలేదన్న కోపంతో సొంత తల్లి, చెల్లి, భార్యను చంపుతానంటూ బెదిరించాడు. మరో వైపు సూర్యకు శ్వేత వేధింపులు ఎక్కువయ్యాయి. సూర్య ఈ వేధింపుల గురించి భార్యకు వాయిస్ మెసేజ్‌లు పంపేవాడు. నిన్న రాత్రి సూర్య, శ్వేత అనుగనహల్లి ఫామ్‌హౌస్లో కలిసి ఉన్నారు. ఉదయానికి సూర్య అనుమానాస్పద స్థితిలో చనిపోయి కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటనా స్థలంలో శ్వేతకు సంబంధించిన వస్తువులు దొరికినట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శ్వేత కోసం గాలిస్తున్నారు. సూర్యను శ్వేతే హత్య చేసి ఉంటుందని సూర్య తల్లి పుష్ప ఆరోపించింది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# డ్యాన్స్ చేయకపోతే సస్పెండ్ చేస్తా..: హెూలీ వేడుకల్లో పోలీసుకు ఆర్జేడీ నేత ఆర్డర్



**న్యూఢిల్లీ-నవభూమి:**ఆర్జేడీ నేత తేజ్ ప్రతాప్ సింగ్ యాదవ్ ఇంట్లో హెూలీ సంబురాలు నిర్వహించుకుంటుండగా.. ఓ పోలీసు అధికారి బందోబస్తు కోసం అక్కడకు వెళ్లారు. అయితే ఆయన యూనిఫాంలో ఉండగానే తేజ్ ప్రతాప్ సింగ్ ఆయన్ను డ్యాన్స్ చేయమంటూ ఆదేశాలు జారీ చేశారు. పాట ప్లే కాగానే డ్యాన్స్ చేయకపోతే.. నిన్ను ఉద్యోగంలోంచి సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుండగా.. అంతా విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నాయకుడు తేజ్ ప్రతాత్ సింగ్ యాదవ్ శనివారం రోజు పాట్నాలోని తన అధికారిక నివాసంలో పార్టీ కార్యకర్తలతో కలిసి హెూలీ సంబురాలు చేసుకున్నారు. అయితే ఆ వేడుకల్లో పాల్గొన్న వారంతా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఫొటోలు దిగారు. ఆపై ఓ చోట కూర్చుని కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈక్రమంలోనే బందోబస్తు కోసం అక్కడకు వచ్చిన ఓ పోలీసు అధికారి కూడా యూనిఫామ్ వేసుకుని నిలబడి ఉన్నారు. అయితే ఈ విషయం గుర్తించిన ఆర్జేడీ నాయకుడు తేజ్ ప్రతాప్ సింగ్ యాదవ్.. పోలీసు అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఇప్పుడు ఒక పాట ప్లే చేస్తామని అందుకు నువ్వు నృత్యం చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఒకవేళ నువ్వు డ్యాన్స్ చేయకపోతే నిన్ను సస్పెండ్ చేస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఏం చేయాలో పాలుపోని అధికారి.. తెగ ఇబ్బంది పడిపోతూనే రెండు స్టెప్పులు వేశారు. ప్రస్తుతం ఇందుకు సంబధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుండగా.. అంతా తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.ముఖ్యంగా బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ.. తండ్రిలాగే కొడుకు ఉన్నాడంటూ చెప్పారు. ఆయన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ కూడా ముఖ్యమంత్రిగా పని చేస్తున్న సయమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు కొడకు అధికారంలో లేకపోయినా.. బెదిరింపులు, ఒత్తిడి ద్వారా చట్టాలను, చట్టాన్ని కాపాడేవారిని ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. నృత్యం చేయకపోతే ఉద్యోగంలోంచి సస్పెండ్ చేస్తామని బెదిరించడం చాలా దారుణం అంటూ వ్యాఖ్యానించారు.అలాగే దీనిపై జేడీయూ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్ స్పందించారు. బిహార్ ప్రజలు పూర్తిగా మారిపోయాయని.. ఇప్పుడు వారు అందరినీ చూస్తూ ఏది మంచి, ఏది చెడో నిర్ణయించుకుంటున్నారని వివరించారు. తేజస్వీ యాదవ్‌కు అయినా, తేజ్ ప్రతాప్ యాదవ్‌కు అయినా.. తప్పు ఎవరు చేసినా ప్రజలు గుర్తించి వారికి గట్టిగా బుద్ధి చెబుతున్నారని పేర్కొన్నారు.

# డొనాల్డ్ ట్రంప్‌ను మైక్‌తో కొట్టిన రిపోర్టర్



**న్యూయార్క్-నవభూమి:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చాలా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అనేక షాకింగ్ నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలను అల్లాడిస్తున్నారు. అయితే తాజాగా ఆయనే షాకయ్యే పని చేసింది ఓ మహిళా రిపోర్టర్. ముఖ్యంగా ట్రంప్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతుండగా.. ఓ మహిళా రిపోర్టర్ అత్యుత్సాహం ప్రదర్శించింది. పైన పైన పడుతూ ప్రశ్నలు అడగ్గా.. ఆమె మైక్ ట్రంప్ ముఖానికి తాకింది. దెబ్బ తగిలిన వెంటనే ట్రంప్ ముఖం మారిపోయింది. కనుబొమ్మలతోనే ఆయన ఆమెను బెదిరించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఆ పూర్తి వివరాలు మీకోసం.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మార్చిన తేదీ శుక్రవారం రోజు అమెరికాలోని మేరీల్యాండ్‌లోని జాయింట్ బేస్ ఆంద్రూస్ విమానాశ్రయం నుంచి బయలు దేరి ఎయిర్ ఫోర్స్ వన్ వేఎక్కే ముందు.. మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ముఖ్యంగా ప్రస్తుతం గాజా పరిస్థితి ఎలా ఉంది, యుద్ధానికి సంబంధించిన విషయాలపై ప్రశ్నలు అడిగారు. ఓవైపు ట్రంప్ సమాధానాలు చెబుతుండగా.. మరోవైపు రిపోర్టర్లు పోటీ పడి మరీ ప్రశ్నలు సంధించారు.

ఈక్రమంలోనే ఓ మహిళా రిపోర్టర్ తన బూమ్ మైక్రోఫోన్‌ను పట్టుకుని.. ప్రశ్న అడిగేందుకు మరింత ముందుకెళ్లింది. దీంతో మైక్ ట్రంప్ ముఖానికి తాకగా.. ఆయన కాస్త ఇబ్బంది పడ్డారు. వెంటనే తన కనుబొమ్మలను ఎగిరేస్తూ.. ఆ మహిళా రిపోర్టర్ వైపు కోపంగా చూశారు. ఆపై వెంటనే ప్రశ్న అడుగుతున్న మరో రిపోర్టర్‌పైకి దృష్టి మళ్లించారు. కానీ ప్రశ్న అడగడం పూర్తి కాగానే.. తనకు దెబ్బ తగిలించిన రిపోర్టర్ ముఖం చూసి మీరు ఈరోజు టెలివిజన్‌లో హాట్ టాపిక్‌గా మారబోతున్నారని అన్నారు.దీంతో అక్కడున్న వారంతా నవ్వుకోగా.. ట్రంప్ కూడా నవ్వారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతుండగా అంతా షాక్ అవుతున్నారు. ట్రంప్ ముఖానికే దెబ్బ తగిలించిందా అని కొందరు.. ఆమె కావాలనే చేసుంటుందని మరికొందరు సోషల్ మీడియా వేదికగా కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు అయితే ట్రంపునకు భద్రతను పెంచాలని వివరిస్తున్నారు. మరి ఈ వీడియో చూస్తే మీకేం అనిపిస్తుందో కామెంట్ల రూపంలో వెల్లడించేయండి.

## శ్రీశైలంలో ఉగాది బ్రహ్మోత్సవాలు.. సత్రాల నిర్వాహకులతో పోలీసుల స్పెషల్ మీట్



**శ్రీశైలం-నవభూమి:**శ్రీశైలం పుణ్యక్షేత్రంలో జరగబోయే ఉగాది బ్రహ్మోత్సవాల దృష్ట్యా సత్రాల నిర్వాహకులతో పోలీస్ అధికా రులు సమావేశం నిర్వహిం చారు. 2022 ఉగాది బ్రహ్మో త్సవాల సమయంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భక్తుల భద్రత, శ్రీశైల క్షేత్ర పవిత్రత, ప్రతిష్ట రక్షణ కోసం ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్రాల నిర్వాహకులకు పోలీస్ అధికారులు పలు సూచనలు చేశారు.

వేంటంటే..1. శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల దర్శనార్థం వచ్చే భక్తుల కోసం శ్రీశైలంలో తాగునీరు సమస్య తలత్తకుండా ప్రతి సత్రం ప్రధాన ద్వారం వద్ద భక్తుల కొరకు రెండు ఉచిత కూల్ వాటర్ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేయాలి. వాటికి ఇనుప చైన్‌లతో కట్టిన నాలుగు గ్లాసులు అందుబాటులో ఉంచాలి. ఈ ఉచిత కూల్ వాటర్ ఫ్రిజ్‌లను శాశ్వతంగా ఏర్పాటు చేయాలి.

2. ప్రతి సత్రంలో నెల రోజుల బ్యాకప్‌తో కూడిన %జజ% కెమెరాలు ఉండాలి. వాటిని ప్రతి రోజు మానిటరింగ్ చేసేందుకు ఒక టెక్నీషియన్‌ను నియమించుకోవాలి.

3. ప్రతి సత్రంలో వివిధ కేటగిరీల రూములకు సంబంధించిన ధరల పట్టికను ఏర్పాటు చేయాలి. రిసెప్షన్ దగ్గర కనబడే విధంగా ధరల పట్టిక ఉండాలి. దళారులను నమ్మి భక్తులు మోసపోకుండా ఉండేందుకు ఈ చర్య తీసుకోవాలి.

4. శ్రీశైల క్షేత్రలో ఏపీ ఎండోమెంట్ చట్టం-1987 అమలులో ఉండటంవలన సత్రం యాజమాన్యానికి సంబంధించి ఎక్కువ మందితో సత్రాలలో సభలు సమావేశాలు నిర్వహించడం, గొడవలు పడటం చేయరాదు.

5. సత్రాలలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు అనగా జూదం, మద్యం సేవించడం, మాంసం తినడం లాంటి పనులు చేయరాదు.

6. కర్ణాటక భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలి.

7. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు సత్రాలకు వచ్చినప్పుడు వారి పూర్తి వివరాలు ఆధార్ నెంబర్‌తో సహా రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలి.

8. సత్రాలకు అనుమానిత వ్యక్తులు వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు తెలియపరచాలి.

9. సత్రాలలో ఎవరినైనా పని కోసం చేర్చుకునేటప్పుడు వారి ప్రవర్తన గురించి విచారిచి చేర్చుకోవాలి.

10. సత్రాలలో పెట్టే ఆహారాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులతో తనిఖీ చేయిస్తుండాలి.

# తాగి నడపలేదు, గుంతలే కారణం

## వడోదర కారు బీభత్సం నిందితుడి వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:**గుజరాత్‌లోని వడోదరలో కారు బీభత్సానికి ఒక మహిళ మృతి చెందగా.. 8 మంది అరెస్ట్ అయ్యారు. ఈ ప్రమాదం తర్వాత నిందితుడు రక్షిత్ చౌరాసియా.. నడిరోడ్డుపై చేసిన హల్‌చల్ అంతా అక్కడ ఉన్న స్థానికులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం రాత్రి అతివేగంగా కారును నడిపిన రక్షిత్ చౌరాసియా ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టడంతో ఒక మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. రోడ్డు పక్కన ఉన్న 8 మంది గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదం తర్వాత.. కారులో నుంచి బయటికి వచ్చిన రక్షిత్.. "అనదర్ రౌండ్, అనదర్ రౌండ్".. "నిఖిత, నిఖిత".. "ఓం నమః శివాయ, ఓం నమః శివాయ" అంటూ గట్టిగా అరుపులు అరిచాడు.ఈ క్రమంలోనే రక్షిత్ చౌరాసియాను పోలీసులు అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు. అయితే తాను మద్యం సేవించి వాహనం నడపలేదని పేర్కొన్నాడు. రోడ్డుపై ఉన్న గుంత కారణంగానే ప్రమాదం చోటు చేసుకుందని వివరించాడు. ఈ నేపథ్యంలోనే తాజాగా శనివారం మీడియాతో మాట్లాడిన రక్షిత్ చౌరాసియా.. గురువారం రాత్రి తాను నడుపుతున్న కారు.. ఆ స్కూటీ కంటే ముందు వెళ్తోందని తెలిపాడు. ఇంతలోనే తాను కుడివైపు వెళ్తలేందుకు ప్రయత్నించగా.. అక్కడ రోడ్డుపై పెద్ద గుంత ఉందని వెల్లడించాడు.కారు టైరు గుంతలో పడటంతో అదుపుతప్పి.. పక్కనే ఉన్న స్కూటీని ఢీకొన్నట్లు పేర్కొన్నాడు. అదే సమయంలో ఎయిర్ బ్యాగ్ తెరుచుకోవడంతో తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదని చెప్పాడు. ప్రమాదం జరిగిన సమయంలో కారు గంటకు 50 కిలోమీటర్ల స్పీడుతోనే వెళ్తోందని వివరించాడు. తాను ఆ సమయంలో మద్యం సేవించి లేనని.. హెూలికా దహనం కార్యక్రమానికి వెళ్లి వస్తున్నట్లు రక్షిత్ చౌరాసియా తెలిపాడు.ఇక ఈ ఘటనపై స్పందించిన వడోదర పోలీస్ కమిషనర్ నరసింహ.. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 3 వాహనాలు ధ్వంసం అయి నట్లు చెప్పారు. ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, 8 మంది గాయపడ్డారని వివరించారు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఉన్నవారి నుంచి సమాచారం సేకర్తిస్తున్నామని.. రక్షిత్ చౌరాసియా మద్యం తాగి వాహనం నడిపినట్లు కేసు నమోదైనట్లు చెప్పారు.

## స్కూల్‌కు ఎస్‌యూవీ కారును వేసుకెళ్లిన బాలుడు..



**న్యూఢిల్లీ-నవభూమి:** 12వ తరగతి విద్యార్థులు లగ్జరీ కార్లతో పరేడ్ నిర్వహించిన వీడియో ఇటీవలే వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అలాంటి మరో వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కొందరు స్కూల్ యూనిఫాం )లో ఉన్న విద్యార్థులు మహీంద్రా 700 కారులో ట్రాఫిక్‌లో చక్కర్లు కొట్టారు.సుమారు ఐదుగురు విద్యార్థులు కారులో ప్రయాణిస్తూ కనిపించారు. అందులోని ఓ బాలుడు రద్దీగా ఉన్న రహదారిపై స్వయంగా కారు నడుపుతూ కనిపించాడు. వీరందరూ 13, 14 ఏండ్ల వయసున్న పిల్లలే. ఈ ఘటన మహారాష్ట్రలోని థానేలో చోటుచేసుకుంది. అటుగా వెళ్తున్న వారు ఈ తతంగాన్నంతా తమ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేయగా.. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులపై మండిపడుతున్నారు. ఇంత చిన్న పిల్లలకు కారు ఇచ్చిన తల్లిదండ్రుల పై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

# తమిళనాడులో రూ.1000 కోట్ల లిక్కర్ స్కామ్ ఆరోపణలు..

## ఈడీ దాడులు, స్టాలిన్‌పై బీజేపీ ఫైర్



**చెన్నై- నవభూమి:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా విధానంపై కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్.. తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వం మధ్య గత కొన్నిరోజులుగా తీవ్ర మాటల యుద్ధం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా డీఎంకే సర్కార్‌పై బీజేపీ తీవ్ర ఆరోపణలు గుప్పించింది. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌పై బీజేపీ మద్యం కుంభకోణం ఆరోపణలు చేసింది. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్-టాస్మాక్‌ను అడ్డం పెట్టుకుని డీఎంకే సర్కార్ రూ.1000 కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించింది. ఇటీవల తమిళనాడు వ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్-ఈడీ నిర్వహించిన దాడుల్లో ఈ లిక్కర్ స్కామ్ వెలుగులోకి వచ్చినట్లు తెలిపింది.ఈడీ సోదాల్లో భారీగా ఆర్థిక అవకతవకలు బయటపడ్డాయని బీజేపీ తెలిపింది. తమిళనాడు లిక్కర్ స్కామ్ బయటపడుతుందనే అనుమానంతోనే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త విద్యా విధానంలోని త్రిభాషా సూత్రాన్ని ఖండించడం, డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు తగ్గిపోతాయని డీఎంకే నేతలు కొత్త అంశాలను తెరపైకి తీసుకొని వచ్చారని బీజేపీ మండిపడింది. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తమిళనాడు రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రోజే ఎంకే స్టాలిన్ ప్రభుత్వంపై బీజేపీ ఈ లిక్కర్ స్కామ్ ఆరోపణలు చేయడం గమనార్హం.ఇక ఈ వ్యవహారంపై బీజేపీ నేత అమిత్ మాలవియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఈడీ దాడులు, లిక్కర్ స్కామ్ లాంటి అంశాల నుంచి తమిళనాడు ప్రజల దృష్టి మరల్చేందుకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ త్రిభాషా విధానం, కొత్త విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ.. వాటిపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్ఈపీ, డీలిమిటేషన్, బడ్జెట్ పత్రాల నుంచి రూపాయి గుర్తును తొలగించడం వంటి అంశాలతో లిక్కర్ స్కామ్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఈడీ సోదాల్లో దొరికిన పత్రాల్లో లెక్కల్లో లేని నగదు లావాదేవీలు ఉన్నాయని పేర్కొన్నారు. డిస్టిలరీ కంపెనీలు.. దాదాపు రూ.1000 కోట్లు లంచాలను కొంత మంది వ్యక్తులకు చెల్లించినట్లు తెలిసిందని అమిత్ మాలవియ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ రూ.వెయ్యి కోట్ల డబ్బు ఎవరెవరికి అందిందో సీఎం స్టాలిన్ తెలియజేయాలని డిమాండ్ చేశారు.ఇక ఇదే లిక్కర్ స్కామ్ ఆరోపణలపై బీజేపీ ఎమ్మెల్యే శ్రీనివాసన్ కూడా తమిళనాడు స్పీకర్‌కు ఒక లేఖ రాశారు. రూల్ 55 ప్రకారం ఈడీ దర్యాప్తు, టాస్మాక్ వద్ద లభించిన అక్రమ చెల్లింపులపై తమిళనాడు ప్రభుత్వం స్పందన చెప్పాలని లేఖలో కోరారు. టెండర్లను తారుమారు చేయడం ద్వారా రూ.వెయ్యి కోట్లు చేతులు మారినట్లు ఎమ్మెల్యే శ్రీనివాసన్ ఆరోపించారు.తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి తంగమ్ తెనరసు అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న సమయంలోనే ప్రతిపక్ష అన్నాడీఎంకే సభను అడ్డుకుంది. లిక్కర్ స్కామ్‌పై డీఎంకే ప్రభుత్వం వివరణ ఇవ్వాలని.. దానిపై సభలో చర్చ జరగాలని పట్టుబట్టింది. అందుకు స్పీకర్ ఒప్పుకోకపోవడంతో.. అన్నాడీఎంకే సభ నుంచి వాకౌట్ చేసింది. లిక్కర్ స్కామ్, ఇతర అవినీతి ఆరోపణలపై డీఎంకే ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి.. ముఖ్యమంత్రి పదవికి స్టాలిన్ రాజీనామా చేయాలని ప్రతిపక్ష నేత ఎడప్పాటి పళనిస్వామి డిమాండ్ చేశారు. తమిళనాడు బడ్జెట్‌లో సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఇతర ప్రాజెక్టులకు భారీగా నిధులను కేటాయిం చారు. మరీ ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉద్యోగకల్పన, ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టులు అందులో ఉన్నాయి.మరోవైపు.. టాస్మాక్‌లో భారీగా అవకతవకలు జరిగాయని బీజేపీ, అన్నాడీఎంకే చేస్తున్న ఆరోపణలను తమిళాడు ఎక్సైజ్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ ఖండించారు. టాస్మాక్‌లో అవినీతి జరిగేం దుకు ఎలాంటి ఆస్కారం లేదని తేల్చి చెప్పారు. సోదాల పేరుతో ఈడీ దాడులు చేసిందని.. కానీ ఏ ఏడాదిలో ఎఫ్ఐఆర్ నమోదు చేసిందో పేర్కొ నలేదని తెలిపారు. టాస్మాక్ రిక్రూట్‌మెంట్‌లో అవకతవకల పేరిట కేసు నమోదు చేసిన ఈడీ.. ఏదో చేయాలని చూసిందన్నారు. గత 4 ఏళ్లుగా బార్ల టెండర్లను ఆన్‌లైన్‌లోనే ప్రాసెస్ చేస్తున్నామని.. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.1000 కోట్ల స్కామ్ జరిగిందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సెంథిల్ బాలాజీ మండిపడ్డారు.

## అమెరికా మిస్సైల్ దాడిలో.. ఐసిస్ గ్లోబల్ ఆపరేషన్స్ చీఫ్ హతం


**న్యూఢిల్లీ-నవభూమి:** ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్ గ్లోబల్ ఆపరేషన్స్ చీఫ్ అబ్దుల్లా మక్కి ముస్లి అల్ రిఫాయి .. అమెరికా నిర్వహించిన వైమానిక దాడిలో హతమయ్యాడు. అబ్దుల్లా మక్కిని అబూ ఖదీజా అని కూడా పిలుస్తారు. ఇరాకీ ఇంటెలిజెన్స్ ఇచ్చిన సమాచారంతో అమెరికా వైమానిక దళం దాడి చేపట్టింది. అబ్దుల్లా మక్కి.. ఐసిస్ గ్రూపులో రెండవ స్థాయి కమాండెంట్‌గా ఉన్నాడు. మార్చి 13వ తేదీన జరిగిన ఆ స్ట్రయిక్‌లో మరో ఐసిస్ ఉగ్రవాది కూడా మరణించినట్లు తెలుస్తోంది.అమెరికా మిలిటరీ అధికారుల ప్రకారం.. అబూ ఖాదిజా .. ఇస్లామిక్ స్టేట్ ఉగ్ర సంస్థకు చెందిన లాజిస్టిక్స్, ప్లానింగ్, ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ చూసుకునేవాడు. డీఎన్ఏ మ్యాచింగ్ ద్వారా అబూ ఖాదిజా మృతదేహాన్ని ధ్రువీకరించారు. అబూ ఖాదిజాను హత మార్చిన అంశంపై ఇరాక్ ప్రధాని మొహమ్మద్ షియా అల్ సుదానీ స్పందించారు. ఇరాక్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఖాదిజా మోస్ట్ డేంజరస్ ఉగ్రవాది అని తెలిపారు. అమెరికా సహకారంతో ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గా చేపట్టినట్లు ఇరాక్ ప్రధాని వెల్లడించారు.

## ఎంపీ కనిమొళి అంతమాట అనేశారేంటో.. ఆమె ఏమన్నారో తెలిస్తే..

చెన్నై-నవభూమి:కేంద్ర ప్రభుత్వ శాఖగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పనిచేస్తోందని డీఎంకే ఎంపీ కనిమొళిఆరోపించారు. టాస్మాక్ ప్రధాన కార్యాలయం, డిస్టిలరీ కంపెనీలు, మాజీ అధికారుల ఇళ్లల్లో ఇటీవల మూడు రోజులు తనిఖీలు చేపట్టిన ఈడీ, టాస్మాక్‌లో రూ.1,000 కోట్లకు పైగా అవినీతి జరిగిందని ప్రకటన విడుదల చేసింది.ఈ నేపథ్యంలో, నగరంలో శు



క్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కనిమొళిని టాస్మాక్ అవినీతిపై విలేఖరులు ప్రశ్నించారు. అందుకు ఆమె బదులిస్తూ... ఈడీ ఏ విధంగా పనిచేస్తోంది అనే విషయం ప్రజలందరికి తెలుసన్నారు. బీజేపీ( రహిత రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ శాఖలా ఈడీ పనిచేస్తోందని ఎంపీ కనిమొళి ఆరోపించారు.



## విస్తరిస్తున్న ధూళి కాలుష్యం

మనం పర్వతాలను కొలుస్తాం. నదులను పూజిస్తాం. అడవులను ఆరాధిస్తాం. వాయువును దేవుడిగా భావిస్తాం. భూమిని తల్లిగా పిలుస్తాం. అదంతా మన సంస్కృతిలో భాగమేనని గొప్పగా చాటుకుంటాం. కానీ, కాలుష్యంలో మనం ప్రపంచంలోని ఐదు దుర్భర దేశాల్లో ఒకటిగా నిలవడం మన ఆచరణలోని డొల్లతనాన్ని ఎత్తి చూపుతున్నది. మన నిర్లక్ష్యానికి, ప్రకృతి విధ్వంసానికి నిలువెత్తు సాక్ష్యం లాంటి ఈ కఠోర సత్యాన్ని ప్రపంచ గాలి నాణ్యత నివేదిక (2024) బయటపెట్టింది. మన మాటలకు ఆచరణకు మధ్య ఏ మాత్రం సం బంధం లేదని ఇది తెలియజేస్తున్నది. మనకు గల ఎన్నో భ్రమలను ఈ నివేదిక పటాపంచలు చేసింది. 2024లో మన గాలిలో ధూళికణాల స్థాయి ఘనపు మీటరుకు 50.6 మైక్రో గ్రాములుగా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు చేసిన స్థాయి కంటే ఇది పదింతలు పైగా ఉండటం గమనార్హం. స్విట్జర్లాండ్ వాయు నాణ్యతా సాంకేతిక సంస్థ ఐక్యూ ఎయిర్ మార్చి 11న విడుదల చేసిన ఈ నివేదికలో ఇంకా దిగ్భ్రాంతికరమైన అంశాలు ఎన్నో ఉన్నాయి. ప్రపంచ దేశాల్లో చాద్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, కాంగో తర్వాత ఐదో స్థానంలో భారత్ ఉండటం ఏ రకంగానూ సమర్థనీయం కాదు. ప్రపంచంలోని 100 కాలుష్య భరిత నగరాల్లో 70 భారత్‌కు చెందినవే కావడం అందులో ఒకటి. పైగా అగ్రస్థానంలో ఉన్న నాలుగు నగరాల్లోనూ మనవి నాలుగు నగరాలున్నాయి. ఈశాన్యంలో ఇంకా కాలుష్యం జడలు విప్పుకోలేదని ఇంతవరకు మనం అనుకుంటున్నాం.

మేఘాలయలోని ఓ సరస్సు అడుగు భాగం స్పష్టంగా కనిపించే స్ఫటిక సదృశంగా ఉంటుదని కథలు కథలుగా చెప్పుకొంటారు. కానీ పై నివేదిక ప్రకారం మేఘాలయలోని బిర్నిహాట్ ప్రపంచంలోని అత్యంత కాలుష్యపూరిత నగరాల్లో మొదటిస్థానంలో నిలవడం విస్మయం కలిగిస్తున్నది. అక్కడ వాయుధూళి కణాల స్థాయి 128.2గా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన పరిమితి కన్నా 25 రెట్లు అధికమన్న మాట. ఆ తర్వాతి స్థానంలో దేశ రాజధాని ఢిల్లీ నిలిచింది. ఇక్కడ ఆసక్తికరమైన అంశం ఏమంటే భారత్ ధూళి కాలుష్యం విషయంలో సొంత ప్రమాణాలు కలిగి ఉండటం. డబ్ల్యూహెచ్‌వో సిఫారసు చేసిన దానికంటే అది నాలుగింతలుగా ఉండటం ఏమిటి? కాలుష్యంపై ఖాతరులేని తనాన్ని ఇది సూచించడం లేదా? డాటా సేకరణలో ముందంజ సాధించినప్పటికీ ఆచరణలో వెనుకబడిపోవడం జరుగుతున్నదనేది వాస్తవం. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం వంటి చర్యలు ప్రభుత్వం చేపడుతున్నప్పటికీ వాటి అమల్లో అవకతవకలు, మౌలిక యంత్రాంగం లోటుపాట్ల కారణంగా సవాళ్లు ఎదురవుతున్నాయని నివేదిక పేర్కొనడమే ఇందుకు నిదర్శనం. గ్యాస్ సిలిండర్ విషయమే తీసుకుంటే కట్టెల పొయ్యిలను తగ్గించడానికి ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ చేపట్టా రు. మొదటిది ఉచితమే కానీ, తదుపరి సిలిండర్లు కొనే స్తోమత లేక చాలామంది గృహిణు లు మళ్లీ కట్టెల పొయ్యి వైపే మొగ్గడం తెలిసిం దే. అలాగని ప్రపంచ దేశాల పరిస్థితి ఏమంత ఆశావహంగా లేదు. 2024లో 17 శాతం నగరాలు మాత్రమే ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిమితికి లోబడి ధూళికణాలు కలిగి ఉన్నాయి.పసిఫిక్ సముద్రంలో భాగమైన ఆస్ట్రేలియా, బహామాస్, బార్బడోస్, స్తోనియా, గ్రెనాడా, ఐస్‌ల్యాండ్ న్యూజిల్యాండ్ అనే ఏడు ఏషియానియా దేశాలు మాత్రమే ధూళి కణాల విషయంలో ఆరోగ్యకరమైన స్థాయిని కాపాడుకుంటున్నాయని నివేదిక తెలిపింది. కన్ను పసిగట్టలేనంత సూక్ష్మమైన ఈ ధూళికణాలు అత్యంత ప్రమాదకరమైనవి. నిర్మాణ, పారిశ్రామిక కార్యకలాపాలు, శిలాజ ఇంధనాల దహనం వల్ల ఇవి వాతావరణంలోకి విడుదల అవుతాయి. వీటివల్ల మనుషుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుంది. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధ వ్యాధులకు ఇవి కారణమవుతాయనేది తెలిసిందే. ఒక అంచనా ప్రకారం 2021లో 81 లక్షల మంది వాయు కాలుష్యం వల్ల ప్రాణాలు కోల్పోయారు. అందులో 58 శాతం మరణాలకు ధూళికణాలే కారణం. దీన్ని కేవలం ప్రాణనష్టం పరంగా మాత్రమే చూడలేం. ఆరోగ్య సంరక్షణ రంగంపై, తద్వారా ఆర్థిక రంగంపై వేసే ప్రభావం అపారమని గుర్తించాలి. ఇప్పుడే కాలుష్యం ఇంతగా ఉంటే రేపటి రోజున పరిస్థితి ఏమిటనేది ఆందోళన కలిగించక మానదు. పై నివేదిక భారత్‌తో సహా ప్రపంచ దేశాలకు ఓ మేలుకొలుపు కావాలి. కాలుష్యం అంతానికి ప్రపంచ దేశాలు దృఢదీక్షతో, చేయీ చేయీ కలిపి సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భావితరాల కోసమైనా ఆ పని చేయకతప్పదు.ఆధునిక పట్టణ జీవితంలోని హడావిడిలో, దుమ్ము కాలుష్యం తరచుగా దృష్టిలో లేదు, అక్షరాలా, కనిపించని కానీ విస్తృతంగా వ్యాపించే పర్యావరణ సమస్యగా. పొగమంచు లేదా పారిశ్రామిక పొగలా కాకుండా , దుమ్ము హానిచేయనిదిగా అనిపించవచ్చు, కానీ ఆరోగ్యం, పర్యావరణం మరియు వాతావరణంపై దాని సంచిత ప్రభావాలు గణనీయమైనవి. శ్వాసకోశ సమస్యలు: ఆస్తమా, బ్రోన్కైటిస్, మరియు ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గడం.

హృదయ సంబంధ సమస్యలు: ధమనుల వాపు లేదా సంకుచితం కారణంగా గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.క్యాన్సర్ కారకాల ప్రమాదాలు: కొన్ని రకాల ధూళికి (సిలికా వంటివి) దీర్ఘకాలికంగా గురికావడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది.

పర్యావరణ మరియు వాతావరణ ప్రభావాలు

**ఆరోగ్యానికి మించి, దుమ్ము కాలుష్యం ప్రభావాలు:**

నేల మరియు నీరు: దుమ్ము నేల పోషకాలను తగ్గిస్తుంది, నీటి నాణ్యతను ప్రభావితం చేస్తుంది మరియు మొత్తం సారవంతమైన స్థితిని తగ్గిస్తుంది.వాతావరణ మార్పు: గాలిలో వ్యాపించే ధూళి వాతావరణ నమూనాలను మార్చగలదు, హిమానీనదాల కరగడానికి దోహదం చేస్తుంది మరియు సముద్ర ఉపరితల

# తొలితరం దళిత కవి కుసుమ ధర్మన్న



మాకొద్దీ నల్ల దొరతనం.. అంటరానితనంపై పోరు సలిపిన తొలి తరం దళిత కవి కుసుమ ధర్మన్న,తన కలంతో, గళంతో ఏకకాలంలో అంటరానితనంపై పోరు సలిపిన కవి కుసుమ ధర్మన్న. సంఘసంస్కరణ అభిలాష కలిగిన ఆయన అంబేద్కర్ నుంచి స్ఫూర్తి పొందారు. కందుకూరి వీరేశలింగం ద్వారా ప్రభావితమయ్యారు. 'మాకొద్దీ నల్ల దొరతనం' అంటూ నినదించిన ఆయన జాతిని మేల్కొల్పే దిశగా ఎన్నో రచనలు చేశారు. నిమ్న జాతి ముక్తి తరంగిణి, నల్ల దొరతనం, హరిజన శతకం వంటివి ఆయన కలం నుంచి జాలువారినవే. రాజమహేంద్రవరంలోని లక్ష్మీవారపు పేటలో,కుసుమ నాగమ్మ, వీరస్వామి,దంపతులకు 17/03/1900 నాడు జన్మించాడు. వైద్య విద్వాన్, సంస్కృతం,ఆంధ్రం, ఆంగ్లం, హిందీ,ఉర్దూలలో, పాండిత్యం కలిగిన వ్యక్తి, నిమ్న జాతి, ముక్తి తరంగిణి, నల్ల దొరతనం, హరిజన శతకం, మాకొద్దీ నల్ల దొరతనం, వంటి రచనలు చేశారు. చదువుకున్న రోజుల్లోనే సంఘసంస్కరణ అభిలాష కలిగి కందుకూరి వీరేశలింగం, చేత




ప్రభావితం అయ్యారు. భారతరత్న డా, బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తి పొంది, అంటరానితనాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో తపించిన తొలి తరం దళిత కవి కుసుమ ధర్మన్న.

తెలుగు వారి తొలి సాహిత్య రాజధాని రాజమహేంద్రవరం, కార్యక్షేత్రంగా జాతీయోద్యమ కాలంలో దళితుల కోసం పొలికేక వేసిన వాడు కుసుమ ధర్మన్న కవి. 1900లో పుట్టి 17 ఏప్రిల్ 1945లో నడి వయసులో నే కన్ను మూసిన ధర్మన్న, జీవించిన జీవితం అటు దేశానికీ, ఇటు దళిత జాతికి అంకితం చేసిన త్యాగశీలి. సాంఘిక, సాంస్కృతిక, సాహితి రంగాలలో కుసుమ ధర్మన్న వేసిన ముద్ర అనితర సాధ్యమైంది. బహుముఖినమైన ధర్మన్న ప్రతిభ ప్రధానంగా ఐదు మార్గాల్లో విస్తరించింది. వైద్యరంగం, సాహిత్య సృజన,కళా రంగం, పత్రిక నిర్వహణ, వాక్తృత్వం. ఈ పంచ గుణాలతో ధర్మన్న ఆనాటి ఆంధ్ర సమాజాన్ని ముఖ్యంగా దళిత జాతిని ఉత్తేజపరిచాడు. వైద్య విద్వాన్ పరీక్ష ఉత్తీర్ణుడు అయినా ధర్మన్న తను నేర్చి వైద్యాన్ని పేద సమాజం కన్నెత్తి చూడ నిరాకరించిన గ్రామీణులకు పేద దళితులకు అందించిన ప్రజా వైద్యుడు. ఆధునిక ప్రజా వాగ్గేయకారుడు, ధర్మన్న తొలి రోజుల్లో గాంధీ సిద్ధాంతాల వైపు చూసిన దళిత విముక్తికి అంబేద్కర్, శరణ్యమని నమ్మి అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రచారం చేశాడు. జయభేరి పత్రికను స్థాపించిన తొలి దళిత పత్రిక సంపాదకుడు కుసుమ ధర్మన్న. 1925 నుండి ఆంధ్ర దేశంలో అనేక ప్రాంతాల్లో జరిగిన అఖిలాంధ్ర మహాసభల్లో ధర్మన్న ఆలోచనత్మకమైన , ఉద్వేగమైన ప్రసంగాలు ఎన్నో చేశాడు. ధర్మన్న రచనలు 1, నిమ్న జాతి విముక్తి తరంగణి, (1921) 2) నిమ్న జాతుల ఉత్పత్తి, మద్యపాన నిషేధం, అంటరాని వాళ్ళ( కథలు) హరిజన శతకం వంటి రచనలు చేశాడు.

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో కవిగా, రచయితగా కుసుమ ధర్మన్న స్థానం అద్వితీయమైనది. దళిత పోరాట చరిత్రలోను ఆయనకు ఆయనే సాటి అందుకే వారి ఆశయాలను ఆలోచనలను, ఉద్యమ స్ఫూర్తిని, సామాజిక సేవను, సమత వాదాన్ని, నేటి తరానికి తెలియజేయాలని ఉద్దేశంతో నేటికీ తను చేసినటువంటి రచనలు, సేవలు, చిరస్థాయిగా నిలిచే ఉన్నాయి.

**మర్చి 17 కుసుమ ధర్మన్న జయంతి సందర్భంగా..**

**-దేవులపల్లి రమేశ్,**
**సిద్దిపేట జిల్లా,**
**9963701294**

# మతతత్వ మురికిలో పొర్లుతున్న సినిమా రంగం



ఒకానొకప్పుడు సినిమా రంగం ప్రగతిశీల భావాలకు నెలవుగా ఉండేది. సామాజిక రుగ్మతలపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే సాధనంగా కొనియాడబడేది. కానీ నేడు అదే సినిమా మానవ సంబంధాలకు విఘాతం కలిగిస్తూ, మానవీయ విలువలకు పాతర వేస్తూ, సాంస్కృతిక కాలుష్యాన్ని పెంచుతూ సమాజంలో అనైక్యతకు, ముస్లింలపై ద్వేషం పెంచే మతతత్వ ఫాసిస్టు పోకడలకు బాటలు వేస్తుంది. మొత్తం సినిమా రంగమంతా కాకపోయినా తులసీవనంలో గంజాయి మొక్కల్లాంటి కొందరు మతపిచ్చ నటులు, దర్శకులు, నిర్మాతలు, మాటల రచయితల వల్ల ఇలాంటి పరిస్థితి నెలకొంది.

ముఖ్యంగా సమాజంలో అతిపెద్ద మైనార్టీ సమాజమైన ముస్లింల మనోభావాలకు వీసమెత్తు విలువ ఇవ్వకుండా దేశద్రోహులుగా, ఖూనీకోర్లుగా చిత్రీకరిస్తూ ఇతర వర్గాల్లో ముస్లిం వ్యతిరేకత పెంచే ఫాసిస్టు కుట్రలకు పాల్పడుతుంది.చరిత్ర ముసుగులో చరిత్రను వక్రీకరించి హిందూ, ముస్లిం ల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతుంది.దేశభక్తి, చరిత్ర ముసుగులో ముస్లిం ద్వేష కేంద్రంగా ఇతివృత్తాలు నిర్మిస్తూ లౌకికవ్యవస్థకే సినీ రంగం గొడ్డలిపెట్టులా మారటం దురదృష్టకరం. ఓ వైపు బతుకు పోరాటంలో ఎన్నో సమస్యలతో కునారిల్లుతూ శ్రామిక జీవన సంస్కృతి కలిగి దేశ ఉత్పత్తి రంగంలో ప్రధాన శ్రమశక్తిగా ఉన్న ముస్లింలు నేడు సినిమా చూడాలంటేనే భయపడే పరిస్థితి దాపురించింది. అదేమంటే చూపించవల్సిన ఫ్యాక్షన్ అంతా చూపించి చివరిలో ఫ్యాక్షన్ తప్పు అని సందేశం ఇచ్చినట్టు ఒక మంచి ముస్లిం క్యారెక్టర్ కూడా పెట్టాం కదా! అని అంటారు. ఇటువంటి కుత్సితమైన మతతత్వ పూరితమైన ఆలోచనలు సినీ పరిశ్రమకు, సమాజానికి మరింత హాని చేసేవే కానీ మేలు చేసేవి కావు.ఈ మధ్య వచ్చిన యానిమల్ అనే సినిమాలో ఖురఖా వేసుకొని ముస్లిం స్త్రీలు సిగరెట్ తాగుతున్నట్టు చూపారు.విలన్ ముస్లిం క్యారెక్టర్ను పెట్టి చాలా జుగుప్స చూపించారు.గర్భంతో ఉన్న ముస్లిం స్త్రీని(విలన్ భార్య )శతృవు భార్య కదా చంపేసేయండి అని హీరో అంటాడు.'పోలీస్ కమీషనర్' అనే సినిమాలో హీరో ఓ ముస్లిం క్యారెక్టర్ను 'రేయ్ తురకోడా' అని పిలుస్తాడు. 'ఖడ్గం' సినిమాలో హీరో



టోపీ గడ్డం ఉన్న విలన్ను హిందూ దేవతా విగ్రహం ఉన్న గుడి కేసి తల మోది చంపుతాడు. పాకిస్తాన్ క్రికెట్లో గెలిస్తే ముస్లింలంతా స్వీట్స్ పంచుకొని ఆనందించినట్లు చూపిస్తాడు.నాటి నుండి నేటి చావా సినిమా వరకు ముస్లిం విద్వేషమే ప్రధాన అంశం.వీటివల్ల సినిమా సంచలనాలు నమోదు చేసుకుని పది కాసులు సంపాదించి పెడితే పెడ్తుందేమో కానీ సమాజానికి ఎంతహాని చేస్తుందో వేరే చెప్పనక్కరలేదు. అయినా ఈ దేశం కోసం రక్తతర్పణ చేసిన ముస్లింల త్యాగాలు ఒక చరిత్ర కాలేకపోయిన చోట ఇంతకన్నా మంచి సినిమాలు వస్తాయని ఆశించడం భంగపాటే అవుతుంది. పైసల కోసం మానవ విలువల్ని, వలువల్ని దిగజార్చేవాళ్ళకు దేశభక్తిని గురించి మాట్లాడే అర్హతే లేదు. ఒక ముస్లిం తన సమస్యల్ని మర్చిపోయి అందరిలా కాసింత వినోదం కోసం థియేటర్కు వెళితే ప్రతి రీలు నీతిలేని ఖడ్గమై కుళ్ళబొడుస్తుంది. ఇలా ఓ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వేధించటంలో సినిమా శాడిజం పరాకాష్టకు చేరుకుంది. మరో దృష్టి కోణం నుండి



పరిశీలిస్తే ముస్లిం స్త్రీల జీవితాల్ని అపహాస్యం పాలు చేసే సినిమాలు వస్తున్నాయి. ఒక ముస్లిం స్త్రీ (హీరోయిన్) బురఖా లాగుతూ హీరో వెకిలి చేష్టలు (దర్శకుడి దృష్టిలో ప్రేమ) చేస్తుంటాడు. ఇలాంటి సన్నివేశాలు చిత్రీకరించటం ద్వారా వీళ్ళు సమాజానికి ఏం సందేశం ఇవ్వాలను కుంటున్నారో ఫాసిజం ఆలోచన విధానం అవగాహన చేసుకున్న వారెవరికైనా తెలుస్తుంది. ఇలాంటి సందేశాలే ఒక రకంగా ఆయేషామీరా హత్యకు కారణం అయ్యాయని ఎవరైనా అంటే తప్పు పట్టవల్సిన అవసరం లేదు.

సినీ ఇండస్ట్రీలో ముస్లిం నటులు, గాయకులు, దర్శకులు, రచయితల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. తమకు ఇష్టమైన స్వంత పేర్లతో పిలవబడే అదృష్టం కూడా వీరికి లేదు. తాము ముస్లిం పేర్లతో కొనసాగితే తమను ఎక్కడ అణిచివేస్తారోనని భయపడ్తూ సినీ రంగంలో అనేక మంది తమ పేర్లు మార్చుకోవటం ముస్లిం కళాకారుల దైన్యస్థితికి అద్దం పడుతుంది. ఇలా సినిమాలో వేళ్ళూనుకుంటున్న ఫాసిజం వల్ల పడగనీడలో ముస్లిం క్యారెక్టర్ ఆర్టిస్టులు సైతం నిత్యం అవమానాలకు గురి అవుతూ తమ కెరీర్ను కాపాడుకోవల్సి వస్తుంది.. కులం కంపులో కుళ్ళిపోతూ, మతతత్వ రొచ్చులో పొర్లాడుతూ సినిమా సగటు ప్రేక్షకులకు జుగుప్స కలిగిస్తుంది.సినిమాల్లో విప్లవ సినిమాలు తీస్తున్నామని చెప్పుకుంటున్నవారి పరిస్థితి సైతం ఇందుకు భిన్నంగా లేదు. వీరికి ముస్లింల జీవితాలు, అభద్రతా భావం, అస్తిత్వ భయాలు ఎప్పుడూ ఇతివృత్తంగా కన్పించలేదు. సమాజంలోని పీడితుడు హిందువైనా, ముస్లిమైనా అతని పక్షం వహించేవాడే నిజమైన కళాకారుడు. అలాకాక సమాజాన్ని ముక్కలు ముక్కలు చేసి మత విద్వేషాలు పెంచాలని చూసేవారు కళాకారులుగా కాక కళాసైతానులుగా మిగిలిపోతారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ సామ్రాజ్యవాదం, దేశీయంగా మతతత్వ ఫాసిజం బుసలు కొడ్తున్న ఈ సందర్భంలో మతసామరస్యాన్ని, నిజమైన దేశప్రేమని పెంపొందించే సినిమాలు తీయటం, ప్రోత్సహించటం సినీ నిర్మాణ సంస్థల నైతిక బాధ్యత. అయితే మొత్తం తెలుగు సినీ ప్రపంచం ఇలా కుళ్ళి పోయిందని మనం గుండెలు బాదుకోవల్సిన అవసరం లేదు కానీ కొద్ది మంది వల్ల మొత్తం సినీరంగానికి అప్రతిష్ట రాకుండా జాగ్రత్త పడవల్సిన అవసరం అందరికీ ఉంది.

ప్రపంచ చరిత్రలో ఎంతో విశిష్టమైన భారతీయ సంస్కృతిలో భాగమైన లౌకికపునాదుల్ని కాపాడుకోవటం అందరి విధి. ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే సాధనంగా, సామరస్య, సహజీవన విలువల్ని పెంపొందించే కళాఖండాల్ని నిర్మిస్తూ విభిన్న వర్గాల వారధిగా సినిమా భవిష్యత్తులో నిలవాలని ఆశిద్దాం..

*"సినీ దర్శకుల్లారా!*
*నలిగి నలిగి నుజ్జయినోడ్ని*
*బిక్కు బిక్కుమని బ్రతికేటోడ్ని*
*చించబడ్డ బురఖాల్ని*
*మూల పడ్డ చరఖాల్ని*
*దొర్లిపడ్డ మా గడ్డం తలల్ని*
*బాయ్నెట్ నెత్తుటి వెలల్ని*
*ఎప్పుడైనా చిత్రించారా?*
*జీవితాంతం మాతో సాగే*
*ఆకలి గీతాల్ని*
*అక్షర క్షయమైన సత్యాల్ని*
*ఎప్పుడైనా విన్పించారా?*
*ఇక మీ సినిమా ఉన్మాదం*
*చూడలేము ఆపండేహె!*

**-కవి కరీముల్లా సామాజిక వ్యాసం**

భక్తి

# ధ్వజస్తంభంలో ఉన్నదెవరు?



భారత యుద్ధానంతరం సింహాసనాన్ని అధిష్ఠించిన ధర్మరాజు అధర్మానికి తావులేకుండా రాజ్యపాలన చేస్తున్నాడు. ధర్మమూర్తిగా, ఎదురులేని దాతగా కీర్తి పతాకం అందుకోవాలనే కాంక్షతో ఎడతెరిపి లేకుండా దానధర్మాలు చేయడం మొదలుపెట్టాడు. ఇది గమనిస్తున్న కృష్ణుడు అతనికి తగు గుణపాఠం నేర్పాలనుకున్నాడు. ధర్మరాజుకి అశ్వమేథ యాగం చేయమని సలహా ఇస్తాడు. శ్రీకృష్ణుడి మాట శిరసావహించి యాగం చేస్తాడు ధర్మరాజు. నకుల సహదేవులు సైన్యంతో యాగ అశ్వరక్షకులుగా బయలుదేరుతారు. ఆ యాగాశ్వం చివరికి మణిపుర రాజ్యం చేరుతుంది. ఆ రాజ్యాన్ని మయూరధ్వజుడు పాలించేవాడు. ఆయన మహా పరాక్రమవంతుడు, గొప్ప దాతగా పేరుపొందాడు. మయూరధ్వజుని కుమారుడైన తామ్రధ్వజుడు పాండవుల యాగాశ్వాన్ని బంధిస్తాడు. తామ్రధ్వజునితో యుద్ధం చేసిన నకుల సహదేవులు, భీమార్జునులు ఓడిపోతారు.

తమ్ములు ఓడిన విషయం తెలిసిన ధర్మరాజు స్వయంగా బయలుదేరగా కృష్ణుడు అతణ్ని వారిస్తాడు. మయూరధ్వజున్ని జయించేందుకు ఒక కపటోపాయాన్ని చెబుతాడు. దాని మేరకు శ్రీకృష్ణుడు, ధర్మరాజు ఇద్దరూ వృద్ధ బ్రాహ్మణుల రూపంలో మణిపురం చేరుతారు. మయూరధ్వజుణ్ని కలుస్తారు. 'దానం కోరుకోమంటాడు' రాజు. అందుకు శ్రీకృష్ణుడు 'రాజా! తమ దర్శనార్థమై మేము వస్తున్న దారిలో ఒక సింహం అడ్డువచ్చి ఈ బ్రాహ్మణుడి కుమారుడిని పట్టుకుని చంపబోయింది. బాలుని విడిచిపెట్టవలసిందని పార్థించాము. అప్పుడు సింహం మానవభాషలో 'మీ కుమారుడు మీకు కావాలంటే మణిపుర రాజ్యాధిపతి మయూరధ్వజుని శరీరంలో సగభాగం నాకు ఆహారంగా ఇప్పించమ'ని కోరింది.

ప్రభువులు మా యందు దయదలచి తమ శరీరంలో సగభాగం దానమిచ్చి బాలుణ్ని కాపాడమ'ని కోరుతాడు. ఆ మాటలు విని అందుకు మయూరధ్వజుడు అంగీకరిస్తాడు. అతని భార్యాపుత్రులే స్వయంగా కోసి ఇవ్వాలనే నియమాన్ని కూడా విధిస్తాడు కృష్ణుడు. అందుకు తగినట్లుగానే భార్యాపుత్రులు మయూరధ్వజుడి శరీరాన్ని సగానికి కోస్తారు. ఆ దృశ్యం చూసిన ధర్మరాజు.. ఆ మహారాజు దానగుణానికి నివ్వెరపోతాడు.

ఇంతలో మయూరధ్వజుని ఎడమకన్ను నుంచి నీరు రావటం గమనించిన ధర్మరాజు 'తమరు కన్నీరు కారుస్తూ ఇచ్చిన దానం మాకు వద్దు గాక వద్దు అన్నాడు. అందుకు మయూరధ్వజుడు 'మహాత్మా! తమరు పొరపాటుపడ్డారు. బాధపడి నా శరీరాన్ని మీకివ్వటం లేదు. నా కుడి భాగం పరోపకారానికి ఉపయోగపడింది. కానీ, ఎడమభాగానికి ఆ భాగ్యం నాకు కలుగలేదు కదా అని ఎడమకన్ను బాధపడుతున్నది' అంటూ వివరిస్తాడు. ఆశ్చర్యపోతాడు ధర్మరాజు.

మయూరధ్వజుడి దానశీలతకు మెచ్చిన శ్రీకృష్ణుడు తన నిజరూపాన్ని చూపి ఏదైనా వరం కోరుకోమన్నాడు. 'పరమాత్మా! నా శరీరం నశించినా నా ఆత్మ పరోపకారార్థం ఉపయోగపడేలా నిత్యం మీ ముందు ఉండేటట్లు దీవించండి' అని కోరుకున్నాడు మయూరధ్వజుడు. తథాస్తు అంటూ వరమిస్తాడు వాసుదేవుడు. 'మయూరధ్వజా! నేటి నుంచీ ప్రతి దేవాలయం ముందునూ గుర్తుగా నీ పేరున ధ్వజస్తంభాలు వెలుస్తాయి. వాటిని ఆశ్రయించిన నీ ఆత్మ, నిత్యం దైవసాన్నిధ్యంలో ఉంటుంది.

ముందు నిన్ను దర్శించి ప్రదక్షిణ నమస్కారాలు ఆచరించిన తర్వాతనే ప్రజలు తమ ఇష్టదైవాలను దర్శించుకుంటారు. నిత్యం నీ దగ్గర దీపం ఎవరు ఉంచుతారో వారి జన్మ సఫలం అవుతుంది. నీ శిరస్సు మీద ఉంచిన దీపం రాత్రి సమయాల్లో బాటసారులకు దారి చూపే దీపం అవుతుంది' అంటూ అనుగ్రహించాడు. ఆనాటి నుంచీ ఆలయాల ముందు ధ్వజస్తంభాలు విధిగా ప్రతిష్ఠించడం ఆచారంగా మారింది.



## పాత కూలర్ వాడుతున్నారా?

పాత కూలర్‌ను ఉపయోగించే ముందు దాన్ని శుభ్రం చేయాలి. లోపల ఫ్యాన్‌కి పట్టి ఉన్న బూజు దులిపి రెక్కలను తడి వస్త్రంతో తుడవాలి. ఫ్యాన్‌లో ఏదైనా సమస్య ఉంటే కొత్తదాన్ని తెచ్చి బిగిస్తే సరిపోతుంది.

కూలర్‌కు మూడు వైపులా అమర్చి ఉండే గడ్డి షీట్ల వల్లే గదిలో చల్లదనం విస్తరిస్తుంది. గత ఏడాది వాడిన కూలర్‌ను చాలాకాలం పక్కన పెట్టి ఉంచడం వల్ల వాటిపై దుమ్ము, ధూళి చేరి ఉంటాయి. వీటిని శుభ్రం చేసినప్పటికీ గదిలో చల్లదనం



వ్యాపించదు. కాబట్టి కొత్త షీట్స్ తెచ్చి అమర్చుకుంటే తాజా గాలి వీచి ఇల్లంతా చల్లగా ఉంటుంది.

పాత కూలర్ నుంచి నీళ్లు కారుతూ ఉంటాయి. నీళ్లు బయటికి వస్తున్నచోట ఎంసీల్‌ను పూతలా రాస్తే సమస్య తీరుతుంది.

కూలర్ లోపల నీళ్లు నిల్వ ఉండేచోటుని శుభ్రంగా కడగాలి. మోటార్, వాటర్ పంప్, ఫ్లోటింగ్ బాల్‌లను పరిశీలించాలి. కూలర్ ముందు భాగంలో ఉండే ఎయిర్ ఫిల్టర్స్‌ని దుమ్ము లేకుండా పలుచని వస్త్రంతో తుడవాలి. కూలర్‌ని వాడుతున్నంతకాలం వారానికి ఒకసారి తుడవాలి.

# సింగరేణి రాణులు



ఒకప్పుడు బొగ్గుగనుల్లో పని చేయాలంటేనే జంకేవారు. భూమి పొరల్లో బొగ్గు వెలికి తీయడం ఆషామాషీ వ్యవహారం కాదు. గాలిసక్రమంగా అందక కార్మికులు ఉక్కిరిబిక్కిరి అయ్యేవారు. గని ప్రమాదాల్లో చనిపోయిన వారెందరో ఉన్నారు. ఇక ముందుతరం ఈ పనులు చేయలేరు అని కార్మికులు అభిప్రాయపడేవారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. గనుల్లో సాంకేతికత అభివృద్ధి చెందింది. సంస్థలో యువరక్తం చేరుతున్నది. కేసీఆర్ కల్పించిన కారుణ్య నియామకాల హక్కుతో కార్మికుల పిల్లల భవిష్యత్తుకు భరోసా ఏర్పడింది. ఇప్పుడు సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అమ్మాయిలు సైతం బొగ్గు గనుల్లో అడుగుపెట్టారు. క్లిష్టమైన పనుల్లోనూ రాణిస్తున్నారు. అధికారులుగా, కార్మికులుగా, టెక్నీషియన్లుగా విధులు నిర్వహిస్తూ.. చరిత్రను తిరగరాస్తున్నారు.

అతివ నడుం బిగిస్తే.. అసాధ్యమనేదే ఉండదు అని నిరూపిస్తున్నారు ఈ సింగరేణి రాణులు. నల్లబంగారు గనుల్లో సత్తా చాటుతున్నారు. సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బొగ్గు ఉత్పత్తిలో అమ్మాయిలు సైతం కదం తొక్కుతున్నారు. ప్రస్తుతం సంస్థలో 1,960 మంది మహిళలు పనిచేస్తున్నారు. మజ్దూర్ నుంచి మేనేజర్ స్థాయి దాకా వివిధ కొలువుల్లో కొలువుదీరి మగవారికి దీటుగా రాణిస్తున్నారు. పురుషులే భారంగా భావించే మైనింగ్ విభాగంలో నారీ శక్తి నానాటికీ పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో వారికోసం అధికారులు ప్రత్యేక గనులను ఏర్పాటుచేసే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే 5 ఇంక్లయిన్‌ను మహిళా గనిగా మార్చేందుకు యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేసింది. మొదట ఒక సెక్షన్‌లో, అనంతరం ఒక షిఫ్టులో, తర్వాత ఫలితాలను బట్టి గనిలో పూర్తిస్థాయిలో మహిళా శక్తిని వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించిన కారుణ్య నియామకాలతో అమ్మాయిలకు బొగ్గుగనుల్లో ఉద్యోగం చేసే అవకాశం లభించింది.

**మైనింగ్‌లో మహిళా శక్తి**



ఒకప్పుడు సింగరేణి కార్యాలయాల్లో మినహా ఇతర విభాగాల్లో మహిళలు పనిచేసిన దాఖలాలు లేవు. 2018లో కేసీఆర్ సింగరేణిలో కారుణ్య నియామకాల హక్కును కల్పించి కార్మికుల పిల్లలకు భరోసా అందించారు. దీంతో కార్మికుడు చనిపోతే భార్య లేదా కుమారుడు, కుమార్తెకు ఉద్యోగం ఇచ్చే అవకాశం ఏర్పడింది. అలాగే కార్మికుడు అనారోగ్యంతో అన్‌ఫిట్ అయితే కుటుంబసభ్యులకు ఉద్యోగం ఇచ్చే హక్కును మళ్లీ తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఎందరో మహిళా కార్మికులు సంస్థలో అడుగుపెట్టారు. కేవలం కారుణ్య నియామకాల ద్వారానే కాకుండా టెక్నికల్ విద్యను అభ్యసించిన అమ్మాయిలు అండర్ మేనేజర్లుగా, ఓవర్‌మెన్‌లుగా బొగ్గుగనుల్లో ఉద్యోగం చేస్తున్నారు. సింగరేణిలోని 11 డివిజన్లలో 1,960 మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో 144 మంది ఎగ్జిక్యూటివ్ హోదాలో, 1,816 మంది నాన్ ఎగ్జిక్యూటివ్ హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు.

**మహిళా గని..**

మహిళా కార్మికులకు అండగా నిలవడానికి సింగరేణి సంకల్పించింది. కొత్తగూడెంలోని పీవీకే 5, భూపాలపల్లిలోని కేటీకే 5 ఇంక్లయిన్, గోదావరిఖనిలో ఒకదాన్ని మహిళా గనులుగా ఎంపిక చేయాలని నిర్ణయించారు. మొదటగా భూపాలపల్లిలోని కేటీకే 5 ఇంక్లయిన్‌లో ప్రయోగాత్మకంగా దీనిని అమలు చేస్తున్నారు. ఇక్కడ రోజుకు సుమారు 700 టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. ప్రస్తుతం బీటెక్ మైనింగ్ చేసిన అమ్మాయిలు అండర్ మేనేజర్ ట్రైనీలుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు ఒక షిఫ్ట్ మొత్తం మహిళా కార్మికులు ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. మహిళా అండర్ మేనేజర్లు, మహిళా ఓవర్‌మెన్‌ల పర్యవేక్షణలో బ్యాచ్‌ల వారీగా విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం దీనిని పూర్తిస్థాయి మహిళా గనిగా మార్చే యోచనలో ఉన్నారు. ఈ ప్రయత్నం విజయవంతమైతే.. సింగరేణి చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైనట్టే అని భావించొచ్చు. అతివ రాజ్యమేలుతున్న ఎన్నెన్నో రంగాల్లో భూగర్భం కూడా వచ్చి చేరుతుంది అనడంలో సందేహం లేదు!

**మహిళల భాగస్వామ్యం అవసరం**



నేను బీటెక్ మైనింగ్ చేశాను. మైనింగ్ డిపార్టుమెంట్ అంటే కష్టమన్నారు. అయినా వెనుకాడలేదు. మాది తొర్రూరు దగ్గర పోచంపల్లి. నాన్న పేరు బల్లూ.. వ్యవసాయం చేస్తారు. నన్ను చాలా కష్టపడి చదివించారు. 2021లో బీటెక్ పూర్తిచేశాను. సింగరేణిలో ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్ష రాసి ఉద్యోగానికి ఎంపికయ్యాను. గత డిసెంబర్‌లో ఉద్యోగంలో చేరాను. భూపాలపల్లిలోని కేటీకే 5 ఇంక్లయిన్‌లో అండర్ మేనేజర్ ట్రైనీగా విధులు నిర్వర్తిస్తున్నా. గని లోపల పూర్తిస్థాయి పట్టు సాధించాను. గతంలో సింగరేణిలో అమ్మాయిలకు అవకాశం ఉండేది కాదు. ఆఫీస్ స్టాఫ్‌లో అరుదుగా కనిపించేవారు. ఇప్పుడు అమ్మాయిల సంఖ్య పెరుగుతున్నది. గనిలోనూ మహిళలు కీలకంగా పనిచేస్తున్నారు. సింగరేణిలో మహిళల భాగస్వామ్యం అవసరం.

**బి.మౌనిక, అండర్ మేనేజర్ ట్రైనీ**

**గనిలోకి దిగుతున్నా**

వరంగల్‌లోని ప్రభుత్వ కళాశాలలో ఐటీఐ ఫిట్టర్ ట్రేడ్ (2015-17) పూర్తిచేశాను. 2024లో సింగరేణి పరీక్ష రాశాను. అదే ఏడాది డిసెంబర్ 16న ఉద్యోగంలో చేరాను. ప్రస్తుతం ట్రైనీగా పనిచేస్తున్నా. మా నాన్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి. ఆయన సలహా మేరకే ఐటీఐ చేశాను. ఆయన ప్రోత్సాహంతోనే గనుల్లో ఏ బెరుకూ లేకుండా పనిచేస్తున్నాను. భూమి లోపలి పొరల్లోకి వెళ్లి.. కష్టమైన పనులెన్నో నేర్చుకుంటున్నా. ట్రైనింగ్ తర్వాత గని బయటా, లోపలా పనులు చేయాల్సి ఉంటుంది. సంస్థ అభివృద్ధికి నావంతు కృషి చేస్తాను. ఇప్పటివరకు సింగరేణిలో మహిళలు ఫిట్టర్ పనిచేసిన దాఖలాలు లేవని అధికారులు చెప్పారు. నాకు అలాంటి అవకాశం రావడం గర్వంగా ఉంది.

**ఎద్దు సౌజన్య, ఫిట్టర్**




**ఎలక్ట్రీషియన్ హోదాలో నేనే**

సింగరేణి చరిత్రలో ఎలక్ట్రీషియన్ హోదాలో ఇప్పటివరకు అమ్మాయిలు ఎవరూ పని చేయలేదు. గనుల్లో భారీ మోటార్లు ఉంటాయి. కరెంటుకు సంబంధించిన పని కత్తిమీద సాములాంటిది. ఏ మాత్రం తేడా వచ్చినా భారీ నష్టం జరుగుతుంది. నా విషయానికి వస్తే.. మాది హన్మకొండ దగ్గరిలోని పైడిపల్లి గ్రామం. నాన్న మేస్త్రీ పనిచేస్తారు. నన్ను కష్టపడి చదివించారు. వరంగల్ ప్రభుత్వ ఐటీఐలో 2013-15లో ఎలక్ట్రీషియన్ ట్రేడ్ పూర్తిచేశాను. గతేడాది డిసెంబర్ 16న నేను సింగరేణి కేటీకే 5 ఇంక్లయిన్‌లో ఎలక్ట్రీషియన్ ట్రైనీగా జాయిన్ అయ్యాను. అధికారుల సాయంతో పనిమీద పట్టు సాధిస్తున్నా! సింగరేణిలో మాకు అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా.

**- పి.శ్రీకన్య, ఎలక్ట్రీషియన్**

# వేసవిలో చెక్కుచెదరకుండా...



వేసవిలో ఉక్కపోతకు మేకప్ చెదిరిపోయే ఇబ్బందులు ఎక్కువే! ఈ కాలంలో చర్మం జిడ్డుగా మారిపోకుండా తాజాగా ఉంచే మేకప్ ఉత్పత్తులను వాడుకోవాలి. అందుకోసం జెల్ ఆధారిత మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్‌లను పూసుకుని, అవి పూర్తిగా చర్మంలోకి ఇంకిపోయాకే మేకప్ వేసుకోవాలి.

ప్రైమర్: చర్మ రంధ్రాలను దాచడంతో పాటు మేకప్‌ను పట్టి ఉంచే స్వభావం కలిగిన ప్రైమర్ మేకప్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి ప్రత్యేకించి వేసవిలో వాటర్‌ప్రూఫ్ ప్రైమర్ ఎంచుకోవాలి. ఒకవేళ జిడ్డు చర్మం అయితే, మ్యాటిఫయింగ్ ప్రైమర్‌ను ఎంచుకోవాలి. ఈ ప్రైమర్ చర్మం మీద నిమిషం పాటు సెట్ అయ్యే వరకూ ఆగి, ఆ తర్వాతే బేస్ మేకప్ మొదలుపెట్టుకోవాలి.

బేస్ మేకప్: అన్ని ఫౌండేషన్‌లూ, కన్‌సీలర్లు వేసవి వేడిని తట్టుకోలేవు. కాబట్టి కరిగిపోకుండా ఉండడం కోసం వీటిని తక్కువ మోతాదులో వీలైనంత పలుచగా పూసుకోవాలి. వీటిని వద్దనుకొంటే టింటెడ్ మాయిశ్చరైజర్ వాడుకోవచ్చు. షీర్, మీడియం కవరేజ్, లైట్ వెయిట్ అనే మూడు రకాల టింటెడ్ మాయిశ్చరైజర్స్, చర్మం తాజాగా కనిపించేలా చేస్తాయి.

సెట్టింగ్ పౌడర్: కష్టపడి మేకప్ వేసుకున్న తర్వాత సెట్టింగ్ పౌడర్ వాడుకోకపోతే, శ్రమంతా వృథా అవుతుంది. తేలికగా జిడ్డుగా మారే వీలున్న ప్రదేశాలను పౌడర్‌తో సెట్ చేసుకోకపోతే, మేకప్ చెదిరిపోతుంది. కాబట్టి ముక్కు, చెక్కిళ్లు, చుబుకం.. ఈ ప్రదేశాల్లో సెట్టింగ్ పౌడర్ అద్దుకోవాలి. అందుకోసం ఫ్లఫ్ఫీ బ్రష్ మాత్రమే ఉపయోగించాలి. అర నిమిషం తర్వాత, బ్రష్‌తో అదనపు పౌడర్‌ను దులిపేసుకుంటే మేకప్ ఎక్కువ సమయం ఉంటుంది.

స్మడ్జ్‌ప్రూఫ్ లిప్‌స్టిక్: ఈ కాలంలో ఎక్కువ సమయం నిలిచి ఉండే ద్రవరూప లిప్‌స్టిక్స్ ఎంచుకోవాలి. ఇవి అద్దుకున్న క్షణాల్లోనే ఆరిపోయి, రోజంతా నిలిచి ఉంటాయి.

బ్లాటింగ్ పేపర్: ఎన్ని జాగ్రత్తలు పాటించినా వేసవిలో ఉక్కపోత ఎంతోకొంత తప్పదు. దాంతో మేకప్ చెదిరిపోకుండా ఉండడం కోసం బ్లాటింగ్ పేపర్స్ అందుబాటులో ఉంచుకోవాలి. రుమాలు, టిష్యూ పేపర్లకు బదులుగా ఈ బ్లాటింగ్ పేపర్‌ను ఉపయోగించుకోవడం వల్ల మేకప్ చెదిరిపోదు. చమట కూడా క్షణాల్లో మాయం అవుతుంది.

# తెర వెనుక వెలుగు ఫల్గు

వెండితెర మీద సినిమా రావాలంటే 24 క్రాఫ్ట్స్ పనిచేయాలి. కథ బాగా పండాలంటే తారాగణం అంతా తమ తమ పాత్రలు చక్కగా పోషించాలి. దాన్ని చిత్రంగా మలిచి మనకు చూపించే కెమెరా కన్ను సినిమాటోగ్రాఫర్‌దే. కథానాయికగానో, ఇతర పాత్రల్లోనో తప్ప, ఛాయాగ్రాహకులుగా పనిచేసే ఆడవాళ్లను మనం చూడటం అరుదు. అలాంటి రంగంలో అడుగు పెట్టి, సృజనాత్మకత ఉంటే చాలు మహిళలూ ఛాయాగ్రాహకులుగా దూసుకుపోవచ్చని నిరూపిస్తున్నది ఒడిశాకి చెందిన ఫల్గు సత్పతి.

'మహిళలు అరుదుగా ఉండే సినిమాటోగ్రఫీలాంటి విభాగాల్లో పనిచేయాలంటే ముందు రెండు రకాల సవాళ్లను అధిగమించాల్సి ఉంటుంది. ఒకటి అంతర్గతమైనది. మరోటి బయటి విషయాలకు సంబంధించింది. ఒక అమ్మాయిగా మనం ఎలాంటి రంగాన్ని ఎంపిక చేసుకుంటున్నాం అన్నది మానసికమైన సవాలు. సినిమాల్లాంటి రంగాల్లో, పూర్తి టెక్నాలజీ మీద ఆధారపడి పనిచేసే చోట మహిళలకు సమాజం ఎంత ప్రాధాన్యం ఇస్తుంది, అసలు వీటిలోకి వెళ్లడానికి కుటుంబం ఎంతవరకూ దన్నుగా ఉంటుంది, శారీరకంగా ఎంత కష్టపడగలం లాంటివి అంతర్గత విషయాలు.

ఈ రెండిటినీ ధైర్యంగా ఎదుర్కోగలిగితేనే ఎవరైనా తమతమ రంగాల్లో ఉన్నతిని సాధించగలరు' అని చెబుతుంటుంది ఫల్గు. ఒడిశా రాష్ట్రంలో ఆమె పేరెన్నికగన్న సినిమాటోగ్రాఫర్. దశాబ్దకాలంగా ఆమె ఈ రంగంలో ఉంది. ఒడియాలో మంచి హిట్ సాధించిన పుష్కర సినిమాకు ఆమే సినిమాటోగ్రాఫర్. ఈ మహిళా దినోత్సవానికి విడుదల కానున్న 'పడే ఆకాశ' సినిమాకు కూడా ఫల్గు ఛాయాగ్రాహకురాలిగా పనిచేసింది. ఆమె ఛాయాగ్రహణం వహించిన మరో రెండు సినిమాలు కూడా విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

చిన్నతనం నుంచే

%ఫల్గు

ఒడిస్సీ నృత్యకారిణి. ఐదేండ్ల వయసు నుంచే ఆమె నాట్యం నేర్చుకుంది. ఇప్పటికీ కొనసాగిస్తున్నది. లెక్కకు మిక్కిలి స్టేజ్ షోలూ ఇచ్చింది. అయితే అంత చిన్న వయసునుంచే ఫల్గుకి నాటకాల మీద కూడా ఆసక్తి ఉండేది. వాటిలో నటించడం అన్నది ఆమెకు ఎంతో సరదాగా ఉండేది. ఒకసారి అలా దూరదర్శన్‌లో నటించింది. అందులో అక్కడి ప్రముఖ కళాకారులు విజయ్ మహంతి, తంద్రా రాయ్ లాంటి వాళ్లతో కలిసి కనిపించింది.

అయితే అదే సమయంలో తనకొక విషయం అర్థం అయింది.



అసలు నాటకం, సినిమా అంటే ఇలా తెర మీద కనిపించే వాళ్లే కాదు, తెర వెనుక కూడా ఎంతోమంది పనిచేస్తుంటారు అని బోధపడింది. అది చిన్న వయసులో ఉన్న ఫల్గుకి ఎంతో ఆసక్తి కలిగించే విషయంగా మారింది. దీంతో వారి గురించి ఆలోచించడం, తెలుసుకోవడం ప్రారంభించింది. ఇక, ఫల్గు వాళ్ల నానమ్మకు సినిమాలంటే బాగా ఇష్టం కావడంతో ఆమెతో కలిసి తరచూ సినిమాలకు వెళ్తూ ఉండేది. ఒక్క ఒడియా సినిమాలే కాదు ఏదీ లేకపోతే ఇద్దరూ కలిసి హిందీ సినిమాలూ చూసేవారట. టీవీలోనూ వచ్చిన ప్రతి సినిమానూ విమర్శనాత్మకంగా చూసేది ఫల్గు.

డైరెక్టర్ కాబోయి

%ఇంటర్మీడియెట్ పూర్తయ్యే సమయానికి ఫల్గు వాళ్ల ఇంటి పక్కన ఉండే ఒక అబ్బాయి సినిమాలకు సంబంధించిన చదువులో చేరాడు. బిజూ పట్నాయక్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఒడిశా (బీపీఎఫ్‌టీఐఓ)లో అతను చదువుతున్నాడు. దీని గురించి ఫల్గుకి తెలియగానే తానూ అందులో చేరాలని భావించింది. అందులోనూ, తన మెదడులో ఆలోచనకు అనుగుణంగా సినిమాను అందంగా అర్థవంతంగా తెరకెక్కించే డైరెక్షన్ విభాగం ఆమెను మరింత ఆకర్షించేది.

అందుకే తానూ డైరెక్టర్ అవ్వాలని అనుకునేది. ఈ క్రమంలో బీపీఎఫ్‌టీఐఓకు దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లింది. అయితే అక్కడ దర్శకత్వ విభాగానికి సంబంధించిన చదువు లేదు. ఇక, తనకు ఇష్టమైన తరువాతి అంశం సినిమాటోగ్రఫీ. అంటే దర్శకుడు అనుకున్న కథకు కెమెరా ద్వారా దర్శకత్వం చేసే పని అన్నమాట. అదే డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ (డీఓపీ). అలా ఈ విభాగంలో పట్టా పుచ్చుకొని, కాలేజీలో తన సీనియర్ దగ్గర తొలుత ఒక రియాలిటీ షోకి పనిచేసింది. తర్వాత సుశాంత్ మణి, శుభ్రాంశు దాస్‌లాంటి పేరెన్నికగన్న ఛాయాగ్రాహకులతో కలిసి ఛాయాగ్రహణం చేసింది.

శిక్షా మండల్, ఫౌజీ కాలింగ్, దివానా దివానీ, హాలో ఇన్ లవ్, లవ్ యూ జెస్సికా తదితర పదుల సంఖ్యలో చిత్రాలు, వెబ్ సిరీస్‌లకు సహాయ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసింది. కెరీర్‌కు సంబంధించి 'మనం ఏ సినిమాకు పనిచేస్తున్నాం అన్నది ఎంత ముఖ్యమో, ఎవరితో కలిసి పనిచేస్తున్నాం అన్నదీ అంతే ముఖ్యం. కష్ట సమయం వచ్చినప్పుడు మనతోటి వారు మనలో ఉత్సాహాన్నీ, ధైర్యాన్నీ నింపేలా ఉండాలి'%ౌ% అని చెబుతుందామె. ఇక, ఆమె సహాయ దర్శకురాలిగా కలిసి పనిచేసిన సుశాంత్ మణినే 'పడే ఆకాశ' చిత్రానికి దర్శకుడు. దివ్యాంగుల హక్కుల కోసం వీల్ చైర్ నుంచే అలుపెరుగని పోరాటం చేస్తున్న ఒడియా మహిళ డా?శ్రుతి మహాపాత్ర జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా ఈ మహిళా దినోత్సవానికి విడుదల కానుంది.





# ఆదివాసీ అందం ఢోక్రా!





ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ప్రత్యేకంగా ఉంటాయి. కొండకోనల్లో జీవించే గిరిజనులకు వనమంటే ప్రాణం. వారి జీవనవిధానంలో సహజ సౌందర్యం ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా ఈ అడవి బిడ్డలు ధరించే ఆభరణాలు.. ప్రకృతి సోయ'గాలాలు' వేస్తాయి! ఈ ఆభరణాల్లో ఒక్కో తెగవి ఒక్కో శైలిలో ఉంటాయి. వేటికవే ప్రత్యేకతను కలిగి ఉంటాయి. ఆధునిక అతివలను తెగ ఆకట్టుకుంటున్న ఢోక్రా ఆదివాసీ ఆభరణాల ముచ్చట్లు ఇవి..






ఢోక్రా నగలు భారతదేశంలోని ప్రాచీన కళారూపాలలో ఒకటి. వీటిది శతాబ్దాల చరిత్ర. ఈ నగలు సింధు నాగరికతలోనూ మనగడలో ఉన్నాయని చెబుతారు. తరతరాలుగా గిరిజనులు ఈ కళారూపాలను కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రకృతి అందాలు, జంతువులు, పక్షులు, ఆదివాసీ దేవతల ఆకృతులు ఈ నగల్లో నిగనిగలాడుతూ ఉంటాయి. చేతులతో తీర్చిదిద్దిన ఈ ఆభరణాల్లో అణువణువూ అద్భుతం అనిపిస్తుంది. వీటిని సాధారణంగా కంచు, ఇత్తడితో తయారుచేస్తారు.

లాస్ట్ వాక్స్ టెక్నిక్‌ను ఉపయోగించి కళాకారులు వీటిని తయారుచేస్తారు. ఈ పద్ధతిలో మొదట మైనంతో అచ్చు (మోల్డ్) తయారుచేసి దాని చుట్టూ మట్టి పూత పూస్తారు. తర్వాత మైనాన్ని కరిగిస్తారు. దాని స్థానంలో కంచు లేదా ఇత్తడిని కరిగించి పోసి నగకు ఓ రూపం తెస్తారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఝార్ఖండ్, తెలంగాణ తదితర రాష్ట్రాల్లోని గిరిజన కళాకారులు వీటిని రూపొందిస్తున్నారు. ఇదే పద్ధతిలో ఇప్పుడు స్వచ్ఛమైన బంగారం, వెండి, ప్లాటినం లాంటి ఖరీదైన లోహాలతో తయారైన నగలు కూడా మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.






ఢోక్రా ఆభరణాలు ప్రకృతి అందాలను, సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. సూర్యచంద్రులు, రాధాకృష్ణులు, చెట్లు, జంతువుల ఆకారాలు పొదిగిన హారాలు, వంకీలు, కంకణాలు, కమ్మలు, పట్టీలు.. ఇలా రకరకాల నగలు ఇందులో అందుబాటులో ఉన్నాయి. పర్యావరణ అనుకూలమైన ఢోక్రా నగలు ఆధునిక ఫ్యాషన్‌కు ఏమాత్రం తీసిపోవు. సంప్రదాయ దుస్తులతోపాటు ట్రెండీవేర్ పైకీ ఇట్టే నప్పుతాయి. నలుగురిలో ప్రత్యేకంగా నిలవాలనుకునేవారికి ఈ ఆభరణాలు సరైన ఎంపిక. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ ట్రై చేయండి!

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
10 | హైదరాబాద్ | ఆదివారం | 16 । మార్చి । 2025






## రెపో రేటు మరో 0.75 శాతం తగ్గింపు!




**ముంబై- నవభూమి:** దేశంలో వడ్డీ రేట్లు మరింత తగ్గనున్నాయి. ప్రస్తుతం 6.25 శాతంగా ఉన్న రెపో రేటును.. ఈ ఏడాది అక్టోబరులోగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ).. ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ముప్పావు శాతం (0.75 శాతం) వరకు తగ్గించే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ వెల్లడించింది. ఏప్రిల్, జూన్, అక్టోబరు నెలల్లో జరిగే ద్వైమాసిక పరపతి, ద్రవ్య విధాన సమీక్షల్లో పావు శాతం (0.25 శాతం) చొప్పున ఎంపీసీ ఈ తగ్గింపు ప్రకటించే అవకాశం ఉందని పేర్కొంది. దిగొస్తున్న రిటైల్ ద్రవ్యోల్బణమే ఇందుకు కారణమని తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మొత్తానికి 4.7 శాతంగా ఉండే రిటైల్ ద్రవ్యోల్బణం వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో 4.2 శాతం మించకపోవచ్చని అంచనా వేసింది. ఫిబ్రవరిలో 3.6 శాతానికి పడిపోయిన రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం మొత్తానికి చూసినా 3.9 శాతం మించకపోవచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది. దీంతో వచ్చే ఏప్రిల్ నుంచే ఆర్‌బీఐ రెపో రేటు కోతకు సిద్ధమవుతుందని భావిస్తున్నారు.

## రూ. 2 లక్షల వరకు పూచీకత్తు లేకుండా లోన్.. అందుకు ఏం చేయాలంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశంలో పునరుత్పాదక ఇంధన విభాగంలో విప్లవాత్మక మార్పును తెస్తూ, ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లి యోజన దేశంలోని లక్షలాది కుటుంబాలకు ఉచిత సౌరశక్తిని అందిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద రూఫ్‌టాప్ సోలార్ చొరవగా పేరుగాంచిన ఈ పథకం ఇప్పటివరకు 10 లక్షల ఇళ్లకు సోలార్ ఎనర్జీ అందించింది. కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ నాటికి ఈ సంఖ్యను 20 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2027 మార్చి నాటికి కోటి ఇళ్లకు సౌరశక్తిని సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈ స్కీం ముందుకు సాగుతోంది.

**ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లి యోజన లక్ష్యాలు**

పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటన ప్రకారం ఈ స్కీం ద్వారా ఇప్పటివరకు 1 మిలియన్ ఇళ్లకు పైగా సౌరశక్తిని అందించామన్నారు. ఇది భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను చేరుకునేందుకు చాలా కీలకమైన ముందడుగని చెప్పవచ్చు.

ఈ పథకం ప్రయోజనాలు ఏంటి?

గృహ యజమానులకు సౌర ఫలకాలను అమర్చుకోవడానికి 40% వరకు సబ్సిడీ

12 ప్రభుత్వ రంగ బ్యాంకులు 6.75% సబ్సిడీ వడ్డీ రేటుతో రూ. 2 లక్షల వరకు పూచీకత్తు లేకుండా రుణాలను అందిస్తున్నాయి

రూ. 78,000 వరకు సబ్సిడీ లభించనుంది

సంవత్సరానికి కేవలం 6.75% వడ్డీ రేటుతో రూ. 6 లక్షల వరకు రుణం తీసుకునే ఛాన్స్

రూ. 2 లక్షల వరకు రుణాలకు ఎలాంటి ఆదాయ పత్రాలు అవసరం లేదు

మొత్తం ఖర్చులో 90% వరకు బ్యాంకు ఫైనాన్స్ సదుపాయం

అర్హత ప్రమాణాలు

దరఖాస్తు దారుడు తప్పనిసరిగా భారతీయ పౌరుడై ఉండాలి

సౌర ఫలకాలను అమర్చడానికి అనువైన పైకప్పు గల ఇంటి యజమానిగా ఉండాలి

ఇంటికి చెల్లుబాటు అయ్యే విద్యుత్ కనెక్షన్ ఉండాలి

ఇంతకు ముందు ఎలాంటి ఇతర ప్రభుత్వ సబ్సిడీని పొందకూడదు

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లి యోజనకు దరఖాస్తు విధానం

ముందుగా అధికారిక వెబ్‌సైట్ https://pmsuryaghar.gov.inను సందర్శించండి

వినియోగదారుల ట్యాబ్‌లో "ఇప్పుడే దరఖాస్తు చేసుకోండి" అనే ఆప్షన్‌ను ఎంచుకోండి (లేదా) "కన్స్యూమర్ లాగిన్" పై క్లిక్ చేయండి

మీ మొబైల్ నంబర్‌ను నమోదు చేసి, ఓటీపీ ద్వారా ధృవీకరించండి

మీ పేరు, రాష్ట్రం, ఇతర వ్యక్తిగత వివరాలను నమోదు చేసి, ఇమెయిల్ ఐడీ ధృవీకరించండి

మీరు అవసరమైతే విక్రేత ఎంపికకు "అవును" లేదా "కాదు" అనే ఆప్షన్‌ను ఎంచుకోండి

'సోలార్ రూఫ్‌టాప్ కోసం దరఖాస్తు చేసుకోండి' పై క్లిక్ చేసి, మీ రాష్ట్రం, జిల్లా డిస్కామ్ వంటి ఇతర వివరాలను నమోదు చేయండి

సాధ్యాసాధ్య అంగీకారాన్ని పొందిన తర్వాత, విక్రేతను ఎంపిక చేసుకుని మీ బ్యాంక్ వివరాలను సమర్పించండి

ఆపై మీ సబ్సిడీ మంజూరైన తర్వాత సోలార్ ప్లాంట్‌ను అమర్చుకోవచ్చు

ఈ పథకం ప్రాముఖ్యత.,.ఈ పథకం ప్రధానంగా దేశంలోని మధ్య తరగతి కుటుంబాలకు తక్కువ ఖర్చుతో విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తుంది. దీని వల్ల విద్యుత్ ఖర్చులు గణనీయంగా తగ్గడంతో పాటు, దేశంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. మీరు కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకుంటే, వెంటనే పైన చెప్పిన విధంగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోండి మరి.

## వచ్చే ఆర్థిక సంవత్సరం ఐటీలో 1.5 లక్షల ఫ్రెషర్ల నియామకాలు!




**న్యూఢిల్లీ-నవభూమి:** ఐటీ రంగంలో మళ్లీ ఉద్యోగావకాశాలు పెరగనున్నాయని, సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రాంగణ నియామకాల జోరు పెంచే అవకాశాలు కన్పిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఫ్రెషర్ల నియామకాలు 1.5 లక్షల స్థాయిని దాటవచ్చని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)తో పోలిస్తే దాదాపు రెట్టింపు కావచ్చన్న అంచనాలున్నాయి. ఈ నెలాఖరుతో ముగియనున్న 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఐటీ కంపెనీల ఫ్రెషర్ల హైరింగ్ 85,000-95,000కు పరిమితం కావచ్చని రిక్రూట్‌మెంట్ సేవల సంస్థ టీమ్‌లీజ్ భావిస్తోంది.సవాళ్ల సంద్రంలో ఐటీ: ప్రస్తుతం దేశీయ ఐటీ రంగం పలు సవాళ్లు ఎదుర్కొంటోంది. ఒకవైపు సాంకేతిక పరివర్తనం.. మరోవైపు ప్రధాన ఆదాయ వనరైన ఉత్తర అమెరికా మార్కెట్లో ఐటీ వ్యయాలు తగ్గడం. ఈ రెండు కారణాల వల్ల కంపెనీలు గత ఏడాదిలో ముందు జాగ్రత్త ధోరణితో వ్యవహరించాయి. వ్యయ నియంత్రణ సాకుతో ఉద్యోగాల్లో కోతలు పెట్టాయి. ప్రాంగణ నియామకాలూ పరిమిత స్థాయిలోనే జరిగాయి. ఐటీ రంగంలో ఇప్పుడిప్పుడే హైరింగ్ మళ్లీ పెరుగుతోందని, కంపెనీలు ముఖ్యంగా ఫ్రెషర్లతో పాటు ప్రత్యేక నిపుణుల నియామకాలపై దృష్టిసారించాయని రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలంటున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ పరివర్తన నిపుణులకు డిమాండ్ పెరిగిందని టీమ్‌లీజ్ డిజిటల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నీతి శర్మ తెలిపారు.

మళ్లీ మాంద్యం భయాలు: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల వడ్డనతో అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితి పెరిగింది. యూఎస్ మళ్లీ మాంద్యంలోకి జారుకోవచ్చన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. అమెరికాలో ఆర్థిక మాంద్యం మన ఐటీ రంగానికి ప్రతికూల పరిణామమే. కాస్త మెరుగవుతూ వస్తున్న నియామకాల సెంటిమెంట్‌ను మళ్లీ దెబ్బతీయవచ్చని కొందరు భావిస్తున్నారు.

**ప్రత్యేక నిపుణులకు భారీ డిమాండ్**

జెనరేటివ్ ఏఐతో వచ్చిన సాంకేతిక పరివర్తన కారణంగా ఐటీ రంగంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వారికి భారీగా డిమాండ్ నెలకొందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. ఏఐ, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, క్లౌడ్ సెక్యూరిటీ, క్లౌడ్ ఆర్కిటెక్ట్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ నిపుణులకు ఆకర్షణీయ పారితోషికం ఆఫర్ చేసేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని రిక్రూటింగ్ ఏజెన్సీలంటున్నాయి.

ఫ్రెషర్లు కోడింగ్‌తో పాటు ఆధునిక టెక్నాలజీల్లోనూ ప్రావీణ్యం సాధించగలిగితే భారీ వేతనంతో కూడిన ఉద్యోగం దక్కించుకోవచ్చని

## బ్యాంకుల్లో లోన్లు తీసుకుంటున్నారా.. ఈ తప్పులు మాత్రం అస్సలు చేయొద్దు..!



**న్యూఢిల్లీ-నవభూమి:** చిన్న చిన్న అవసరాల కోసం కూడా ఇప్పట్లో బ్యాంకుల్లో లోన్లు తీసుకుంటూ ఉంటామన్న సంగతి తెలిసిందే. అయితే ఇక్కడే సాధారణంగా చాలా మంది లోన్ తీసుకోవడంతో పాటు ఈఎంఐలు చెల్లించే విషయంలో కూడా తప్పులు చేస్తుంటారు. అందుకే ఇప్పుడు మనం రుణ గ్రహీతలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది చూద్దాం. ముందుగా పర్సనల్ లోన్ తీసుకునే సమయాల్లో ఎక్కువగా సుదీర్ఘ కాల వ్యవధిని ఎంచుకుంటుంటారు. అయితే వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లు ఎక్కువగా ఉంటాయి కాబట్టి ఇది సరైనది కాదు. మీరు ముందుగా దీర్ఘకాల ఈఎంఐ ఎంచుకొని.. మీ దగ్గర డబ్బులు ఉన్నప్పుడు ముందుగానే లోన్ తీర్చేయాలనుకుంటే అప్పుడు రుణ సంస్థలు ప్రీ క్లోజర్ ఛార్జీల్ని వసూలు చేస్తుంటాయి. అందుకే.. పర్సనల్ లోన్లకు గరిష్టంగా 2-3 ఏళ్ల కాలవ్యవధిని పెట్టుకోవడం మంచిది.ముఖ్యంగా కొన్ని క్రెడిట్ కార్డులపై పరిమితి మేరకు క్యాష్ విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మనకు క్రెడిట్ కార్డులో ఈ సౌకర్యం ఉంది కదా అని నగదు విత్‌డ్రా చేయాలనుకోవడం మంచి పద్ధతి కాదు. ఇక్కడ ఇలా డబ్బులు తీసుకుంటే.. 2-3 శాతం వరకు ప్రాసెసింగ్ ఫీజు పడుతుంది. వడ్డీ కూడా నెలకు 3-4 శాతంగా ఉండొచ్చు. మీరు అత్యవసర పరిస్థితుల్లో ఇలా క్రెడిట్ కార్డు లోన్ తీసుకున్నా.. వెంటనే తీర్చేసేందుకు ప్రయత్నించాలి. లేకపోతే వడ్డీ భారం భరించలేరు.

ఇక చాలా బ్యాంకులు కారు విలువపైన 90 శాతం వరకు రుణాలు ఇస్తుంటాయి. ఈఎంఐ టెన్యూర్ కోసం కూడా ఏడేళ్ల వరకు అనుమతిస్తుంటాయి. ఇక్కడ కూడా టెన్యూర్ ఎక్కువగా పెట్టుకుంటే.. మీరు ఎక్కువ ఈఎంఐ చెల్లించాల్సి వస్తుంది. రుణ భారం పెరుగుతుంది. అందుకే.. ఈ లోన్లు తీసుకునేటప్పుడు ముందుగా కారు విలువలో 30-40 శాతం వరకు డౌన్ పేమెంట్ చెల్లించి.. 4-5 ఏళ్ల పాటు ఈఎంఐ పెట్టుకోవడం మేలు.హోం లోన్ అనేది కూడా దీర్ఘకాలం పాటు చెల్లిస్తూనే ఉండాలి. ఇక్కడ కూడా రుణ మొత్తం, చెల్లించే కాలం, ఈఎంఐ అన్నీ ఎక్కువగానే ఉంటాయి. చాలా మంది ఇక్కడ వడ్డీ ఎక్కువగా ఉన్నప్పటికీ.. చివరివరకు కూడా అదే బ్యాంకులో లోన్ కొనసాగిస్తుంటారు. అయితే.. వడ్డీ రేటు ఒక శాతం తక్కువగా లభించినా వేరే బ్యాంకుకు దీన్ని బదిలీ చేసుకోవడం మంచిది. ఇక్కడ ఒక శాతం వడ్డీ రేటు తగ్గినా.. దీర్ఘకాలంలో పెద్ద మొత్తంలో ఆదా చేసుకోవచ్చు. ఇక బంగారు లోన్ల విషయంలో.. ఎక్కడి పడితే అక్కడ బంగారం తాకట్టు పెట్టి లోన్ తీసుకోవడం మంచిది కాదు. బంగారానికి బ్యాంకుల్లోనే భద్రత ఎక్కువ ఉంటుంది. సరసమైన వడ్డీ రేట్లకే లోన్లు కూడా ఇస్తున్నాయి.

## జాక్‌పాట్.. బంగారంపై మూడింతల రిటర్న్స్..

### అప్పుడు గ్రాముకు రూ. 2943.. ఇప్పుడు రూ. 8624!




**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర ప్రభుత్వం లాంచ్ చేసిన ఎన్నో గొప్ప పథకాల్లో సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ ఒకటి. ఇక్కడ బంగారంపై ఆన్‌లైన్‌లోనే ఇన్వెస్ట్ చేసేందుకు వీలుంటుంది. ఇక్కడ 8 సంవత్సరాల టెన్యూర్ ఉంటుంది. అవసరమైతే.. ఐదేళ్ల తర్వాత కూడా ముందస్తుగా ఉపసంహరించుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం తరఫున ఆర్బీఐ గోల్డ్ బాండ్లు జారీ చేస్తుంటుంది. ఇక గతంలో ఒక దశలో ప్రతి నెలలో గోల్డ్ బాండ్లను జారీ చేసేది.. తర్వాత ప్రతి త్రైమాసికానికి ఒకసారి జారీ చేసేది. ఐదేళ్ల దాటిన తర్వాత లేదా 8 ఏళ్ల తర్వాత పూర్తిగా ఉపసంహరించుకోవచ్చు. ఇక ముందుచూపుతో 8 సంవత్సరాల కిందట గోల్డ్ బాండ్లలో ఇన్వెస్ట్ చేసిన వారికి ఇప్పుడు జాక్‌పాట్ తగిలిందని చెప్పొచ్చు. 2016-17 సిరీస్- బాండ్లకు సంబంధించి.. తాజాగా రిడెంప్షన్ ప్రైస్, డేట్‌ను ఆర్బీఐ ప్రకటిం చింది. ఈ మార్చి 17 మెచ్యూర్ తేదీగా ప్రకటించింది. ఈ క్రమంలోనే అప్పట్లో ఈ సిరీస్ గోల్డ్ బాండ్లలో పెట్టుబడులు పెట్టిన వారికి బంపర్ రిటర్న్స్ వచ్చాయి. ఏకంగా మూడింతల లాభం వచ్చిందని చెప్పొచ్చు. మన దేశంలో భౌతిక బంగారం కొనుగోళ్లు తగ్గించాలన్న ఉద్దేశంతోనే 2015 నవంబర్ నెలలో ఆర్బీఐ ఈ గోల్డ్ బాండ్లను తీసుకొచ్చింది. 2017 మార్చి సమయంలో జారీ చేసిన నాలుగో విడత బాండ్స్ ధరను.. ఆర్బీఐ తాజాగా ప్రకటించింది.అప్పట్లో గోల్డ్ బాండ్లను గ్రాముకు రూ. 2943 చొప్పున ఇష్యూ చేయగా.. ఇప్పుడు గ్రాముకు రూ. 8624 రిడెంప్షన్ ధరను ప్రకటించింది. ఈ క్రమంలోనే కళ్లుచెదిరే రిటర్న్స్ వచ్చాయని చెప్పొచ్చు. ఇన్వెస్ట్‌మెంట్ పరంగా చూసినట్లయితే.. అప్పట్లో రూ. లక్ష ఇన్వెస్ట్ చేసినట్లయితే గ్రాముకు రూ. 2943 చొప్పున.. 33.97 గ్రాముల బంగారం వచ్చేది. ఇక ఇప్పుడు అదే రూ. 8624 చొప్పున ఆ లక్ష పెట్టుబడి ఇప్పుడు రూ. 2.93 లక్షల అయ్యుండేది. ఇంకా గోల్డ్ బాండ్లపై ఏటా కేంద్రం వడ్డీ రేటు చెల్లిస్తుంటుంది. ఈ సిరీస్‌పై అప్పట్లో 2.50 శాతం వడ్డీ రేటు ప్రకటించగా.. ఇంకా ఎక్కువే రిటర్న్స్ వచ్చుంటాయని చెప్పొచ్చు. ఇది రూ. 3 లక్షలు దాటుతుంది.ఇక గ్రాము ధరను నిర్ణయించేందుకు ఇష్యూ సమయంలో ముందు వారం చివరి 3 రోజుల సగటు ధరను ఇండియన్ బులియన్ జువెల్లర్స్ అసోసియేషన్ నిర్ణయిస్తుంది. దీనినే ఆర్బీఐ ఖరారు చేస్తుంది. గతంలో రెగ్యులర్‌గా ఈ బాండ్లను జారీ చేయగా.. ఇప్పుడు జారీ చేయట్లేదు. చివరిసారిగా 2024 ఫిబ్రవరిలో సబ్‌స్క్రిప్షన్‌కు తీసుకురాగా.. తర్వాత ఆ ఊసే లేదు. ఈ బాండ్ల జారీ వల్ల కేంద్రానికి రుణ భారం ఎక్కువవుతుందని కొద్ది రోజుల కిందట కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి స్వయంగా చెప్పారు. దాదాపుగా వీటిని నిలిపివేసినట్లేనని తెలుస్తోంది. గతంలో ఇష్యూ చేసిన వాటికి సంబంధించి.. బడ్జెట్‌లో నిధుల్ని కేటాయిస్తోంది.

## భయపెడుతున్న బంగారం, వెండి ధరలు.. ఎంతకు చేరాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో పసిడి ధరలు సామాన్యులకు షాక్ ఇస్తున్నాయి. గత వారంలో 87 వేల స్థాయిలో ఉన్న ఈ రేట్లు, ఇప్పుడు దాదాపు 90 వేల స్థాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో భయం, రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితుల వంటి పలు అంశాలు పసిడి ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రధానంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు, డాలర్ ధరలో మార్పులు, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న వస్తు ధరల కారణంగా పసిడి రేట్లు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో మార్చి 15, 2025న గుడ్ రిటర్న్స్ వెబ్?సైట్ ప్రకారం హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ.89,790కి చేరింది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 82,310 స్థాయికి చేరుకుంది. ఇదే సమయంలో ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 89,940కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 82,460కు చేరింది. మరోవైపు వెండి ధరలు దేశంలో కిలోకు రూ. 103,100 స్థాయికి చేరుకున్నాయి.

**దేశంలో వివిధ నగరాల్లో బంగారం ధలు ఎలా ఉన్నాయంటే (24, 22 క్యారెట్)**

న్యూఢిల్లీలో రూ.89,940, రూ.82,460
ముంబైలో రూ.89,790, రూ.82,310
కోల్‌కతాలో రూ.89,790, రూ.82,310
చెన్నైలో రూ.89,790, రూ.82,310
బెంగళూరులో రూ.89,790, రూ.82,310
అహ్మదాబాద్లో రూ.89,840, రూ.82,360
విశాఖపట్నంలో రూ.89,790, రూ.82,310
జైపూర్లో రూ.89,940, రూ.82,460

**బంగారం శుద్ధతను ఎలా కొలుస్తారు**

బంగారాన్ని క్యారెట్లలో కొలవడం అనేది బంగారం శుద్ధతను తెలియజేసే పద్ధతి. 24 క్యారెట్ బంగారం అంటే 100% శుద్ధత కలిగిన బంగారం. అయితే, సాధారణంగా వినియోగించే బంగారం 22 క్యారెట్, 18 క్యారెట్ లేదా 14 క్యారెట్ రూపంలో ఉంటుంది.బంగారం ధరలు మార్కెట్లో ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కానీ దీనిలో శుద్ధత ఆధారంగా బంగారం ధరలు ఉంటాయి.

24 క్యారెట్: 100% శుద్ధత కలిగిన బంగారం
22 క్యారెట్: 91.7% శుద్ధత కలిగిన బంగారం
18 క్యారెట్: 75% శుద్ధత కలిగిన బంగారం
14 క్యారెట్: 58.3% శుద్ధత కలిగిన బంగారం

## వారెన్ బఫెట్ ముందుచూపు



**న్యూయార్క్-నవభూమి:** స్టాక్ మార్కెట్ పెట్టుబడులతో రూ.లక్షల కోట్లు సంపాదించిన అమెరికా కుబేరుడు, ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ ముందే జాగ్రత్త పడ్డారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మరోసారి అధికారం చేపడితే స్టాక్ మార్కెట్ కుప్పకూలే ప్రమాదం ఉందని ముందే ఊహించినట్టున్నారు. గత ఏడాది నవంబరులో అమెరికా స్టాక్ మార్కెట్ గరిష్ఠ స్థాయికి చేరగానే తన పోర్టుఫోలియో షేర్లలో చాలా వాటిని అమ్మేసి 32,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.28.29 లక్షల కోట్లు) నగదు దగ్గర పెట్టుకున్నారు. ఈ నగదును ఎప్పుడు కావాలంటే అపుడు మళ్లీ షేర్లలో మదుపు చేసేందుకు వీలుగా స్వల్పకాలిక ట్రెజరీ బిల్స్, లిక్విడ్ ఆస్తుల్లో మదుపు చేశారు.అవకాశం కోసం నిరీక్షణ: 2008 ఆర్థిక సంక్షోభానికి ముందూ వారెన్ బఫెట్ ఇలానే జాగ్రత్త పడ్డారు. ప్రధాన కంపెనీల షేర్లు భారీగా పడిపోయిన వెంటనే చౌకగా వాటిని కొని సొమ్ము చేసుకున్నారు. ఇప్పుడు కూడా బఫెట్ అలాంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్నారని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. మార్కెట్ పతనంపై ఒక స్పష్టత వచ్చాక బఫెట్ ఈ నగదుని మంచి కంపెనీల షేర్లలోకి మళ్లిస్తారని భావిస్తున్నారు. ట్రంప్ సుంకాల యుద్ధంతో అమెరికాతో పాటు అనేక దేశాలు ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని బఫెట్ అంచనా. అదే జరిగితే మళ్లీ బఫెట్ పంట పండినట్టే.

## రూ.10 నుంచి రూ. 3 వేలపైకి చేరిన షేర్ ధర..



**న్యూఢిల్లీ-నవభూమి:** స్టాక్ మార్కెట్లో పెట్టుబడి అనేది ఏదో వెన్నతో పెట్టిన విద్య లాంటిది కాదని చెప్పొచ్చు. ఇక్కడ కూడా ఎంతో ఆర్థిక క్రమశిక్షణ ఉండాలి. లోతైన పరిశీలన, పరిశోధన ఉండాలి. ముఖ్యంగా ఎంతో ఓపిక ఉండాలి. అప్పుడే రిస్క్ లేకుండా మెరుగైన రిటర్న్స్ ఆశించవచ్చు. అందుకోవచ్చు. అయితే ఇక్కడ ముఖ్యంగా మనం ఎలాంటి స్టాక్ ఎంచుకున్నామన్నదే ముఖ్యం. ఆ తర్వాత.. దానిని ఎన్నేళ్లు పెట్టుబడి పెట్టి అలాగే కొనసాగించామన్నదే ముఖ్యం. అవును.. ఏ స్టాక్ ఎప్పుడు పెరుగుతుందో మనమేం ముందుగానే ఊహించలేకపోవచ్చు. కానీ స్టాక్ ఎంచుకునే ముందు మాత్రం కచ్చితంగా ఆలోచించాలి. దాని గురించి పూర్తి స్థాయిలో పరిశోధించాలి.ముఖ్యంగా ఆయా కంపెనీల పనితీరు, ఫలితాలు, పెట్టుబడి వ్యూహాలు, ప్రకటనలు ఇలా అన్నింటినీ పరిశీలిస్తుండాలి. అప్పుడే దాని గురించి మనం ఒక అంచనాకు రావొచ్చు. గత కొన్నేళ్లుగా పనితీరు ఎలా ఉంది.. సంస్థ భవిష్యత్తు ప్రణాళికలు ఏంటి.. భవిష్యత్తులో రాణిస్తుందా లేదా ఇలా అన్ని విషయాల గురించి తెలుసుకున్నాకే.. అప్పుడు కూడా నిపుణుల నుంచి సలహాలు తీసుకోవడం వల్ల మెరుగైన ఫలితాల్ని అందుకోవచ్చు. ఇప్పుడు స్టాక్ మార్కెట్లు కాస్త ఒడుదొడుకుల్లో ఉన్నా కూడా.. లాంగ్ రన్‌లో అద్భుతమైన లాభాలు అందించిన ఒక స్టాక్ గురించి ఇప్పుడు చూద్దాం. ఇదే థర్మాక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్. ఇది లాంగ్ టర్మ్ ఇన్వెస్టర్లకు కాసుల పంట పండించిందని చెప్పొచ్చు. 24 సంవత్సరాల కిందట ఇందులో రూ. లక్ష ఇన్వెస్ట్ చేసిన వారికి ఇన్నేళ్లలో పెరిగిన స్టాక్ ధరకు అనుగుణంగా ఏకంగా రూ. 3.46 కోట్లు వచ్చేవంటే నమ్మండి. ఈ క్రమంలోనే స్టాక్ ధర రూ. 9.75 నుంచి ప్రస్తుత స్థాయికి చేరింది. గురువారం (మార్చి 13) సెషన్లో కూడా ఈ స్టాక్ 2.85 శాతం మేర పెరిగి రూ. 3,355.10 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో రూ. 3,481 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది.

గడిచిన నెల వ్యవధిలో చూస్తే 8 శాతం వరకు పెరిగింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ, అలాగే 6 నెలల వ్యవధిలో, ఏడాది వ్యవధిలో ప్రతికూల ఫలితాలే ఇచ్చినప్పటికీ.. లాంగ్ రన్‌లో కాసుల పంట పండించింది. ఐదేళ్లలో చూస్తే 300 శాతానికిపైగా రిటర్న్స్ అందుకున్నారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ. 116 కోట్లుగా నమోదైంది. అయితే ఇదే సమయంలో గతేడాది చూస్తే లాభం రూ. 238 కోట్లుగా ఉండగా.. ఇప్పుడు 51 శాతం తగ్గింది. కంపెనీ ఆర్డర్స్ బుకింగ్ కూడా ఇటీవల తగ్గడంతో స్టాక్ షార్ట్ టర్మ్‌లో క్షీణించింది. చివరగా.. నిపుణుల సలహాతోనే స్టాక్స్ కొనుగోలు చేయడం ఉత్తమం.

## ఈవీ చార్జింగ్ స్టేషన్లకు ప్రోత్సాహమేది?..

### డబ్బులు చెల్లించినా పరికరాలివ్వని విద్యుత్ సంస్థలు



**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం అంతకంతకూ పెరుగుతున్నా, ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటులో ప్రోత్సాహం కరువైంది. ముఖ్యంగా విద్యుత్తు సంస్థలే మోకాలడ్డుతు న్నాయి. రాష్ట్రంలోని పెట్రోల్ బంకుల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ..విద్యుత్ సంస్థలు మాత్రం సహాయ సహకారాలు అందించడం లేదు. ఈ మేరకు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ, చార్జ్‌జోన్, నయారా, అదానీ, జియో వంటి సంస్థలు ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకున్నాయి. హైదరాబాద్ సహా జిల్లా కేంద్రాలు, చిన్న పట్టణాల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300 స్టేషన్ల ఏర్పాటుకు అనుమ తులు లభించాయి. ఈ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమయ్యే ట్రాన్స్‌ఫార్మర్లు, ఉపకరణాలు, పరికరాలను డిస్కమ్‌లే సరఫరా చేయాల్సి వున్నది. ఈ స్టేషన్ల కోసం 63 కేవీఏ, 100 కేవీఏ, 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల తోపాటు, కేబుళ్లు, ఏబీ స్విచ్ బోర్డు వంటి పరికరాలను డిస్కంలు సరఫరా చేయాలి.

వాటికి కావాల్సిన నగదును కంపెనీలు చెల్లించాక డిస్కమ్ స్టోర్స్ నుంచి ఆయా సంస్థలకు వాటిని అందజేయాలి. ఇందుకు సంబంధించి 3 నెలల క్రితమే ఒక్కో సంస్థ రూ.3.5 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు నగదును డిస్కమ్‌లకు చెల్లించాయి. నిబంధనల ప్రకారం మూడు రోజుల్లో పరికరాలను అందించాల్సి ఉన్నది. 15 రోజుల్లో బిగించాలి. కానీ మూడు నెలలు దాటినా ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలను డిస్కమ్‌లు సరఫరా చేయడమే లేదు. దీంతో ఆయా సంస్థల ప్రతినిధులు డిస్కమ్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా కనీస స్పందన కరువైంది. ఈ ప్రభావం అంతిమంగా ఈవీ వాహన వినియోగదారులపై పడుతున్నది. పలుచోట్ల స్టేషన్లు లేక చార్జింగ్ చేసుకోలేక వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో ఈవీ వాహనదారులు తమ ఇంటిలోనే చార్జింగ్ పెట్టుకుంటున్నారు. ఇది ప్రమాదం అని తెలిసిన సరిపడ చార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో ఇంట్లో విద్యుత్‌తో సరిపెట్టుకుంటున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా ఇదీ పరిస్థితి!**

సంగారెడ్డి జిల్లాలో 15 ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఓ సంస్థ ముందుకొచ్చింది. ఈ సంస్థ రూ.40 లక్షల వరకు డిస్కమ్‌కు చెల్లించింది. అయితే వీటిలో నాలుగు స్టేషన్లు మాత్రమే పూర్తయ్యాయి. 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను డిస్కం సరఫరా చేయకపోవడంతో 11 కేవీ స్టేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి.

నల్లగొండ జిల్లాలో 20 స్టేషన్ల ఏర్పాటుకు ఓ సంస్థ 80 లక్షలకు పైగా చెల్లించింది. కానీ ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకపోవడంతో పురోగతి లేదు.

హైదరాబాద్ సెంట్రల్‌లో మొత్తం 30 చార్జింగ్ స్టేషన్ల కోసం మరో సంస్థ రూ.1.20 కోట్లు చెల్లించింది. ఇప్పటివరకు కేవలం 10 చార్జింగ్ స్టేషన్లు మాత్రమే పూర్తికాగా, 20 స్టేషన్ల ఏర్పాటు ముందుకు సాగడంలేదు.

ట్రాన్స్‌ఫార్మర్లు, ఉపకరణాలు సరఫరా చేయకపోవడంతో ఒక్క హైదరాబాద్‌లోనే 100 స్టేషన్ల ఏర్పాటు నిలిచిపోయింది.

## హల్దిరామ్స్‌లో టెమాసెక్‌కు 10% వాటా

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో అతిపెద్ద ప్యాక్డ్ స్నాక్ అండ్ స్వీట్స్ కంపెనీ, రెస్టారెంట్ల ఆపరేటర్ హల్దిరామ్ స్నాక్స్ ఫుడ్‌లో 10 శాతం వాటాను సింగపూర్ ప్రభుత్వ పెట్టుబడి సంస్థ టెమాసెక్ కొనుగోలు చేసినట్లు ఇండస్ట్రీ వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి ఇరువర్గాల మధ్య విధిగా కట్టుబడి ఉండే ఒప్పందం ఈ నెల 11న (మంగళవారం) కుదిరినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందంలో భాగం గా హల్దిరామ్ స్నాక్ ఫుడ్ మార్కెట్ విలువను 1,000 కోట్ల డాలర్లు (దాదాపు రూ.85,000 కోట్లు)గా లెక్కగట్టినట్లు సమాచారం. అంటే, సంస్థలో 10 శాతం వాటా కోసం టెమాసెక్ 100 కోట్ల డాలర్లు (రూ.8,500 కోట్లు) చెల్లించనుంది. దేశీయ ప్యాక్డ్ ఫుడ్ ఇండస్ట్రీలో ఇప్పటివరకిదే అతిపెద్ద వాటా కొనుగోలు ఒప్పందం. అంతేకాదు, హల్దిరామ్ ప్రమోటర్లైన అగర్వాల్ కుటుంబం ప్రస్తుతం సంస్థలో 100 శాతం వాటా కలిగి ఉంది.





## మంటపై తలకిందులుగా శిశువు వేలాడదీత.. దెబ్బతిన్న కళ్లు

**భోపాల్-నవభూమి:** అనారోగ్యం బారిన శిశువును తల్లిదండ్రులు ఒక భూతవైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అతడు ఆ శిశువును మంటపై తలకిందులుగా వేలాడదీశాడు. ఈ నేపథ్యంలో ఆ శిశువు రెండు కళ్లు దెబ్బతిన్నాయి. దీంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆ పసిబిడ్డ చూపు కోల్పోవచ్చని డాక్టర్లు పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లాలో ఈ దారుణం జరిగింది. కోట్వర్ గ్రామంలో నివసించే కుటుంబానికి చెందిన ఆరు నెలల పసి బాబు అనారోగ్యానికి గురయ్యాడు.కాగా, తమ కుమారుడికి గాలి సోకి ఉంటుందని తల్లిదండ్రులు భావించారు. మార్చి 13న భూతవైద్యుడు రఘువీర్ ధాకాడ్ వద్దకు ఆ శిశువును తీసుకెళ్లారు. ఆ పసి బాబును కొన్ని నీడలు వెంటాడుతున్నాయని అతడు చెప్పాడు. వాటిని వదిలిస్తానంటూ మంటపై తలకిందులుగా వేలాడదీశాడు. మంట వేడికి తాళలేని ఆ శిశువు గట్టిగా ఏడ్చాడు. అయితే నయమవుతుందని భావించి తల్లిదండ్రులు మిన్నకుండిపోయారు.మరోవైపు ఈ సంఘటన తర్వాత ఆ పసిబాబు కళ్లు తెరువలేకపోయాడు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు శివపురి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. కంటి డాక్టర్లు ఆ శిశువు కళ్లను పరిశీలించారు. రెండు కళ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. 72 గంటలు గడిస్తే గాని ఆ శిశువు కళ్ల పరిస్థితి గురించి చెప్పలేమన్నారు. ఆ పసిబాబు కంటి చూపు కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.

## గోల్డ్ స్మగ్లింగ్ కేసులో నటి రన్యారావుకు బిగ్ షాక్.. కోర్టు కీలక నిర్ణయం





**బెంగళూరు-నవభూమి:** కర్ణాటకలో పెను ప్రకంపనలు సృష్టిస్తున్న గోల్డ్ స్మగ్లింగ్ కేసులో కీలక నిందితురాలిగా ఉన్న నటి రన్యా రావుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. బంగారం అక్రమ రవాణా కేసులో ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు తిరస్కరించింది. ఆమెపై ఉన్న అభియోగాలు తీవ్రమైనవని పేర్కొన్న జడ్జి విశ్వనాథ్ సీ గౌడర్.. ఇలాంటి కేసుల్లో నిందితులకు బెయిల్ ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పారు. ఆమెను జ్యుడీషియల్ కస్టడీలోనే ఉంచాలని ప్రాసిక్యూషన్ చేసిన వాదనలతో ఏకీభవించిన జడ్జి.. బెయిల్ పిటిషన్ కొట్టేశారు. మరోవైపు.. రన్యా రావు బెయిల్ పిటిషన్ ఇప్పటికే మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించగా.. తాజాగా ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు కూడా అదే తీర్పునిచ్చింది. దీంతో సెషన్స్ కోర్టులో బెయిల్ పిటిషన్ వేసేందుకు రన్యారావు లాయర్లు రెడీ అయ్యారు.దుబాయ్ నుంచి భారత్‌కు అక్రమంగా బంగారాన్ని తరలిస్తూ.. మార్చి 4వ తేదీన బెంగళూరులోని కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో రన్యారావు డీఆర్ఐ అధికారులకు అడ్డంగా దొరికిపోయింది. ఆమె వద్ద రూ.12 కోట్ల విలువైన 14.8 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. రన్యా రావు తన నడుముకు ధరించిన బెల్టులో బంగారాన్ని తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.రన్యా రావు సినీ నటి కావడం, ఆమె సవతి తండ్రి కర్ణాటక డీజీపీ హోదాలో ఉండటం.. ఆమె వెనుక పెద్ద పెద్ద నేతలు, సెలబ్రిటీలు ఉన్నారని వార్తలు రావడంతో ఈ గోల్డ్ స్మగ్లింగ్ కేసు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అనంతరం ఆమెను అరెస్ట్ చేసి విచారణ చేపట్టిన అధికారులు.. రన్యా రావు ఇంట్లో సోదాలు నిర్వహించగా.. మొత్తంగా రూ.17.29 కోట్ల విలువైన బంగారం, నగదు పట్టుబడింది.ఇక ఈ కేసులో ఇప్పటికే సీబీఐ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఆమె కొన్ని నెలల క్రితం పెళ్లి చేసుకోగా.. ఆ పెళ్లికి ఎవరెవరు హాజరయ్యారు, వారు ఏమేం గిఫ్టులు ఇచ్చారు అనేది తేల్చేందుకు రన్యా రావు పెళ్లి వీడియోను తనిఖీ చేస్తున్నారు. మరోవైపు.. గతేడాది కాలంలో రన్యా రావు దాదాపుగా 30 సార్లు దుబాయ్‌కి వెళ్లి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ప్రతీ ట్రిప్‌లోనూ ఆమె పెద్ద మొత్తంలో బంగారాన్ని దుబాయ్ నుంచి స్మగ్లింగ్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. స్మగ్లింగ్ చేసిన ప్రతీ కిలో బంగారానికి ఆమె లక్ష రూపాయలు సంపాదించిందని.. ఒక్కో ట్రిప్‌కు రూ.12-13 లక్షలు సంపాదించేదని తేలింది.ఇక బెంగళూరు ఎయిర్‌పోర్టులో ప్రోటోకాల్ సహాయాన్ని అందించడానికి.. ఆమె సవతి తండ్రి డీజీపీ రామచంద్రరావు ఆర్డర్ ఇచ్చే వాడని ఎయిర్‌పోర్టు విధుల్లో ఉన్న కానిస్టేబుల్ విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇంటర్నేషనల్ స్మగ్లింగ్ నెట్‌వర్క్ ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కేసులో కర్ణాటక వ్యాప్తంగా ఈడీ అధికారులు దాడులు చేస్తున్నారు.

## ఇంటర్ విద్యార్థులకు గుడ్‌న్యూస్.. ఇక ఫ్రీగా ల్యాప్‌టాప్‌లు, రూ.2 వేల కోట్ల నిధులు




**చెన్నై- నవభూమి:** తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వం 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. శుక్రవారం ఉదయం తమిళనాడు అసెంబ్లీలో బడ్జెట్‌ను ఆ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు ప్రవేశపెట్టారు. ఈ క్రమంలోనే వివిధ కొత్త పథకాలను ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇంటర్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, అనాథ పిల్లలకు నెలకు ఆర్థిక సాయం, చెన్నై సమీపంలో కొత్త నగర నిర్మాణం, రామేశ్వరంలో ఎయిర్‌పోర్టు, ఇళ్ల నిర్మాణ పథకం, స్కూలు పిల్లలకు అల్పాహార పథకం విస్తరణ సహా అనేక పథకాలను అమలు చేయనున్నట్లు బడ్జెట్‌లో ఎంకే స్టాలిన్ సర్కార్ కీలక ప్రకటనలు చేసింది.తమిళనాడు వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ప్లస్ టూ(ఇంటర్) చదివే విద్యార్థులకు ఫ్రీగా ల్యాప్‌టాప్‌లు లేదా ట్యాబ్‌లు అందించనున్నట్లు ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెట్టిన తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు ఈ ప్రకటన చేశారు. ఈ పథకం కోసం తాజాగా పెట్టిన బడ్జెట్‌లో రూ.2 వేల కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో 20 లక్షల మంది ఇంటర్ విద్యార్థులకు ఈ ల్యాప్‌టాప్‌లను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. వారికి ప్రతి నెలా రూ.2 వేలు ప్రభుత్వం అందిస్తుందని ప్రకటించారు. విద్యకు పిల్లలు దూరం కావద్దు అనే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.మరోవైపు.. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. బడ్జెట్‌లో స్టాలిన్ ప్రభుత్వం కీలక నిర్ణయాలను వెలువరించింది. రాజధాని చెన్నై సమీపంలో మరో కొత్త నగరాన్ని నిర్మిస్తామని చెప్పారు. 2 వేల ఎకరాల్లో కొత్త నగరం రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. ఇక తమిళనాడులోని సుప్రసిద్ధ ఆధ్యాత్మిక నగరమైన రామేశ్వరంలో కొత్తగా ఎయిర్‌పోర్టు నిర్మించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో "కలైంజర్ కనవు ఇల్లమ్ పథకం" కింద రూ.3500 కోట్లతో గృహాల నిర్మాణం చేపట్టనున్నట్టు ప్రకటించారు.మరోవైపు.. తమిళ తిరుక్కురళ్‌ను 45 భాషల్లోకి అనువదించనున్నట్టు మంత్రి తెన్నరసు ప్రకటించారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇవ్వబోమని చెప్పిన నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుకుంటుందని.. అదే సమయంలో తమిళనాడులో కచ్చితంగా ద్విభాషా విధానాన్నే అమలు చేస్తామని ఈ సందర్భంగా తేల్చిచెప్పారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి చదివే విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ఇప్పటివరకు చెన్నై, తిరువళ్లూరు జిల్లాల్లో అమలు చేస్తుండగా.. ఇక నుంచి తమిళనాడు వ్యాప్తంగా విస్తరించనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్ వరకు చదివి ఉన్నత విద్యా కోర్సుల్లో చేరే విద్యార్థినులకు ప్రతినెలా రూ. వెయ్యి చెల్లించే పుదుమైపెణ్ పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఆర్థికసాయం అందించే తమిళ్ పుదల్వన్ పథకాలను హిజ్రాలకు కూడా అమలు చేయనున్నట్లు మంత్రి తెన్నరసు చెప్పారు.

## బీచ్‌లో చనిపోయిన జెల్లీ ఫిష్‌లు.. పర్యాటకులు ఆందోళన



**భువనేశ్వర్-నవభూమి:** బీచ్ ఒడ్డుకు చనిపోయిన జెల్లీ ఫిష్‌లు కొట్టుకువస్తున్నాయి. వీటి కారణంగా సముద్రంలో స్నానం చేసే వారు దురదల బారిన పడుతున్నారు. కొంతమంది అనారోగ్యం పాలై ఆసుపత్రుల్లో చేరుతున్నారు. దీంతో బీచ్‌లో జెల్లీ ఫిష్‌లు తేలుతుండటంపై పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. ఒడిషాలోని ప్రముఖ పూరీ బీచ్ ఒడ్డుకు చనిపోయిన జెల్లీ ఫిష్‌లు పెద్ద సంఖ్యలో కొట్టుకువస్తున్నాయి. సముద్రం నీటిపై అవి తేలుతున్నాయి.కాగా, సముద్రంలో స్నానం చేసే పర్యాటకులు జెల్లీ ఫిష్‌ల కారణంగా దురదల బారిన పడుతున్నారు. గత నెల రోజులుగా పూరీ బీచ్‌లో స్నానం చేసిన వారిలో కొందరు వ్యక్తులు చికిత్స కోసం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చేరారు. హాస్పిటల్‌లోని డాక్టర్లు కూడా దీనిని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో పూరీ బీచ్‌ను శుభ్రం చేయాలని, పరిశుభ్రతను కాపాడేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని పర్యాటకులు, సముద్ర ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు లోతైన సముద్ర ప్రాంతాల్లో నివసించే జెల్లీ ఫిష్‌లు పెద్ద సంఖ్యలో మరణించి తీరానికి కొట్టుకురావడంపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా వేసవి సమయంలో ఇలా జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

## హోలీ వేళ ట్రాఫిక్ ఉల్లంఘన.. 17 వేల జరిమానాలు.. రూ.1.8 కోట్ల ఫైన్



**న్యూఢిల్లీ-నవభూమి:** రంగుల పండుగ హోలీని దేశ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇక హోలీ సందర్భంగా ముంబై పోలీసులు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కీలక ప్రదేశాల్లో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడిన వారిపై భారీగా జరిమానా విధించారు. మొత్తం మార్చి 13, 14 తేదీల్లో 17,495 జరిమానాలు విధించారు. వీటి ద్వారా రూ.1.79 కోట్లు ఫైన్ వేశారు.హెల్మెట్ లేకుండా వాహనం నడిపినందుకు గానూ 4,949 కేసులు నమోదయ్యాయి. ఇక మద్యం సేవించి వాహనం నడిపినందుకు గానూ 183 కేసులు, రాంగ్ వే డ్రైవింగ్ చేసినందుకు గానూ 33 కేసులు, వన్ వే కింద 992 కేసులు, ట్రిపుల్ రైడింగ్ చేసినందుకు గానూ 425 కేసులు, సిగ్నల్ జంపింగ్‌కు 1,942 కేసులు, లైసెన్స్ లేకుండా వాహనం నడిపినందుకు గానూ 826 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మొత్తంగా రెండు రోజుల డ్రైవ్‌లో రూ.1.79 కోట్ల విలువైన 17,495 జరిమానాలు విధించినట్లు వివరించారు.

## మాజీ ఎంపీ కులాంతర వివాహం.. కుటుంబాన్ని వెలివేసిన కులం



**నబరంగ్‌పూర్-నవభూమి:** ఒడిశాకు చెందిన మాజీ ఎంపీ ప్రదీప్ మాఝీకి బిగ్ షాక్ తగిలింది. ప్రదీప్ మాఝీ కుటుంబాన్ని ఆయన తెగకు చెందినవారు సామాజిక బహిష్కరణ చేశారు. భాత్రా గిరిజన వర్గానికి చెందిన ఆయన.. ఇటీవల కులాంతర వివాహం చేసుకోవడం పట్ల ఆ వర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఆయన కుటుంబాన్ని కులం నుంచి వెలివేస్తున్నట్లు భాత్రా సంఘం వెల్లడించింది. 12 ఏళ్ల వరకు ఈ సామాజిక వెలివేత అమలులో ఉంటుందని పేర్కొంది. అప్పటివరకు ప్రదీప్ మాఝీ ఇంట్లో జరిగే ఏ కార్యక్రమాలకు భాత్రా సంఘం ప్రజలు వెళ్లరని.. ప్రదీప్ మాఝీ కుటుంబ సభ్యులు కూడా కుల సభ్యుల ఇళ్లల్లో జరిగే కార్యక్రమాలకు హాజరు కావద్దని పేర్కొన్నారు.ఒడిశాలోని నబరంగ్‌పూర్ నియోజకవర్గం నుంచి గతంలో ఎంపీగా గెలుపొందిన ప్రదీప్ మాఝీ.. ఇటీవలె కులాంతర వివాహం చేసుకున్నారు. బ్రాహ్మణ కులానికి చెందిన సుశ్రీ సంగీత సాహూను ఆయన.. గోవాలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పెళ్లి చేసుకున్నారు. అయితే కులాంతర వివాహం చేసుకున్నందుకు ప్రదీప్ మాఝీపై, ఆయన కుటుంబంపై.. భాత్రా తెగకు చెందిన ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలోనే ఆయనను, ఆయన కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరిస్తున్నట్లు తేల్చి చెప్పారు. ప్రదీప్ మాఝీ వయసు 48 ఏళ్లు.ప్రదీప్ మాఝీ.. సోదరి సంజూ మాఝీ కూడా కులాంతర వివాహం చేసుకుందని భాత్రా సంఘం నేతలు తెలిపారు. సంజూ మాఝీని ఓ బ్రాహ్మణ వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారని.. దీన్ని తాము ఖండిస్తున్నట్లు అఖిల భారతీయ ఆదివాసీ భత్రా సొసైటీ ఒక ప్రకటన విడుదల చేసింది. బ్రాహ్మణ కులస్థులను పెళ్లి చేసుకున్న మాఝీ కుటుంబాన్ని 12 ఏళ్ల పాటు కులం నుంచి వెలివేస్తున్నట్లు భాత్రా సంఘం తెలిపింది. భాత్రా గిరిజన తెగకు చెందిన ఎవరు కూడా .. ప్రదీప్ మాఝీ ఇంట్లో జరిగే శుభకార్యాలకు వెళ్లకూడదని తమ తీర్మానంలో పేర్కొన్నారు. భాత్రా సంఘం తీసుకున్న నిర్ణయం పట్ల మాజీ ఎంపీ ప్రదీప్ మాఝీ గానీ, ఆయన కుటుంబసభ్యులు కానీ ఇప్పటివరకు స్పందించలేదు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఒడిశాలోని నబరంగ్‌పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రదీప్ మాఝీ ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత ఆయన గత ఏడాది ఆయన బిజూ జనతాదళ్ పార్టీలో చేరారు.

## అప్పుడు ఆయన పుట్టి ఉండరు.. పవన్ కల్యాణ్‌పై డీఎంకే నేతల విమర్శలు




**చెన్నై- నవభూమి:** త్రిభాషా విధానం అమలు విషయంలో కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం మధ్య గత కొన్ని రోజులుగా వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ వివాదంపై ప్రముఖ నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చకు దారితీస్తున్నారు. త్రిభాషా సూత్రంపై డీఎంకే తీరును పవన్ ఆక్షేపించారు. దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటూ మాట్లాడుతున్నప్పుడు.. తమిళ సినిమాల్ని హిందీలో డబ్బింగ్ ఎందుకు చేస్తున్నారంటూ ప్రశ్నించారు. పవన్ వ్యాఖ్యలపై తమిళనాడు డీఎంకే ప్రభుత్వం తాజాగా స్పందించింది.

ఈ మేరకు డీఎంకే అధికార ప్రతినిధి డాక్టర్ సయ్యద్ హాఫీజుల్లా వివరణ ఇచ్చారు. భాషా విధానంపై తమిళనాడు వైఖరిని పవన్ తప్పుగా అర్థం చేసుకున్నారని వ్యాఖ్యానించారు. వ్యక్తిగతంగా హిందీ లేదా మరే ఇతర భాషలు నేర్చుకోవడాన్ని తాము అడ్డుకోవడం లేదన్నారు. ప్రజలపై హిందీ లేదా మరే ఇతర భాషను బలవంతంగా రుద్దడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. తమిళనాడు సుదీర్ఘ కాలంగా హిందీకి బలవంతపు ప్రాధాన్యత ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తోందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎన్‌ఈపీ, పీఎం శ్రీస్కూల్స్ వంటి విధానాలతో రాష్ట్ర ప్రజలపై బలవంతంగా హిందీ భాషను రుద్దుతోందన్నారు.ఇక పవన్ వ్యాఖ్యలపై డీఎంకే సీనియర్ నేత టీకేఎస్ ఎళన్‌గోవన్ మాట్లాడుతూ.. 'తమిళనాడు భాషా విధానం చాలా కాలంగా స్థిరంగా ఉంది. 1938 నుంచే తమిళనాడు హిందీకి వ్యతిరేకంగా పోరాడుతోంది. ద్విభాషా విధానాన్నే అమలు చేస్తామని 1968లో రాష్ట్ర అసెంబ్లీలో చట్టాన్ని కూడా ఆమోదించుకున్నాం. విద్యా నిపుణుల సలహాలు, సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఆ బిల్లు పాస్ అయినప్పటికీ పవన్ కల్యాణ్ పుట్టి ఉండరు. తమిళ రాజకీయాలపై ఆయనకు అవగాహన లేకపోయి ఉండొచ్చు' అని విమర్శించారు.పిఠాపురంలో శుక్రవారం నిర్వహించిన సభలో జనసేనాని పవన్ కళ్యాణ్ పలు విషయాల గురించి మాట్లాడారు. ఈ క్రమంలోనే తమిళనాట హిందీని తమపై రుద్దుతున్నారని హడావిడి చేస్తున్న కొందరి గురించి కామెంట్స్ చేశారు. అంటే పరోక్షంగా తమిళనాడు అంశాన్ని ప్రస్తావించారు. అన్ని దేశ భాషలే కదా. తమిళనాడులో హిందీ వద్దని అనడం ఎంత వరకు కరెక్ట్. మరి తమిళ సినిమాలను హిందీలోకి అనువదించకండి.. హిందీవాళ్ల డబ్బులు కావాలి.. కానీ హిందీ భాష వద్దంటే ఎలా? మనం భాషలను ద్వేషించాల్సిన అవసరం లేదు. దేశానికి తమిళం సహా బహుళ భాషలు కావాలి.. బహుభాషలే దేశానికి మంచిది అంటూ పవన్ కళ్యాణ్ కామెంట్ చేశారు.అంతేకాదు తమిళనాడులో సంస్కృతాన్ని తిడుతున్నారు. దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటూ మాట్లాడుతున్నారు. ఏ రాష్ట్రంలో అయిన ముస్లింలు అరబిక్‌లోనే ప్రార్థిస్తారు. కానీ ఎన్నడూ ఆ భాష తమకొద్దని అనలేదు. హిందువులు మాత్రం దేవాలయాలలో సంస్కృత మంత్రాలు చదవొద్దని చెబుతుంటారు. ముస్లింలని చూసి హిందువులు చాలా నేర్చుకోవాలి. రూపాయి సింబల్ మార్చేసి తమిళ భాషలో పెట్టుకోవటం ఏంటి? వివేకం, ఆలోచన ఉండొద్దా అన్నారు పవన్ కళ్యాణ్. ఉత్తరాది వాళ్లు తెల్లగా ఉంటారు. మేం దక్షిణాది వాళ్లం నల్లగా ఉంటామనే మాటలతో దేశాన్ని విచ్ఛిన్నం చేయకండి. దక్షిణాదికి చెందిన సెంగోల్.. ఉత్తరాదిన ఉన్న పార్లమెంట్‌లో ఉంది. దీని అర్థం వైరుధ్యమొస్తే విడిపోవాలని కాదు. కలిసి పరిష్కారం వెతుక్కోవాలని. విధ్వంసం చాలా తేలిక. నిర్మించటమే కష్టం అని పవన్ అన్నారు.

## బాయ్‌ఫ్రెండ్స్‌తో భార్య అసభ్యకర చాటింగ్ చేయడం ఏ భర్త సహించలేడు: హైకోర్టు





**న్యూఢిల్లీ-నవభూమి:** వివాహం తర్వాత పురుషుడు గానీ స్త్రీ గానీ.. తమ స్నేహితులతో అసభ్యకరమైన చాటింగ్ చేయడం అంగీకరించే చర్య కాదని.. మధ్యప్రదేశ్ హైకోర్టు పేర్కొంది. ఏ భర్త కూడా తన భార్య నుంచి అలాంటి అసభ్యకరమైన చాటింగ్‌ను సహించలేడని స్పష్టం చేసింది. లైంగికపరమైన విషయాలను బాయ్‌ఫ్రెండ్స్‌తో భార్య పంచుకోవడాన్ని చూసి ఏ భర్త తట్టుకోలేడని వెల్లడించింది. ఓ జంటకు కింది కోర్టు విడాకులు మంజూరు చేయగా.. ఆ తీర్పును భార్య అప్పీలు చేయగా.. విచారణ జరిపిన మధ్యప్రదేశ్ హైకోర్టు.. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. భార్య తీరు క్రూరత్వం కిందికే వస్తుందని పేర్కొంటూ.. వారిద్దరికీ విడాకులు మంజూరు చేయడం సరైందేనని తేల్చి చెప్పింది.కేసు వివరాల ప్రకారం.. ఓ యువతి, యువకుడు 2018లో పెళ్లి చేసుకున్నారు. అయితే ఆ మహిళ పెళ్లి అయిన తర్వాత కూడా మగ స్నేహితులతో కొనసాగిస్తున్న సంబంధాలను.. వాళ్లతో చేస్తున్న అసభ్యకరమైన చాటింగ్‌ను భర్త గుర్తించాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన భర్త.. తన భార్య నుంచి విడాకులు కావాలని కోర్టును ఆశ్రయించాడు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన ఫ్యామిలీ కోర్టు.. వారిద్దరికీ విడాకులు మంజూరు చేసింది. అయితే ఆ విడాకుల తీర్పును భార్య.. మధ్యప్రదేశ్ హైకోర్టులో అప్పీల్ చేసింది.ఈ క్రమంలోనే విచారణ జరిపిన మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వివేక్ రోసియా, జస్టిస్ గజేంద్ర సింగ్‌లతో కూడిన ధర్మాసనం.. విడాకులకు అనుమతి ఇస్తూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ.. ఆ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భర్తపై భార్య క్రూరత్వం కారణంగా ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసిందని తెలిపింది. తన భార్య మొబైల్ ద్వారా బాయ్‌ఫ్రెండ్‌తో ఇలాంటి అసభ్యకరమైన చాటింగ్ చూసి ఏ భర్త సహించడని చెప్పింది.పెళ్లి తర్వాత భార్యాభర్తలు ఇద్దరూ తమ ఫ్రెండ్స్‌తో కలిసి మాట్లాడే స్వేచ్ఛను కలిగి ఉంటారని పేర్కొన్న హైకోర్టు.. ఆ సంభాషణ మర్యాదగా, గౌరవంగా ఉండాలని పేర్కొంది. ఇక పురుషులతో మహిళలు.. మహిళలతో పురుషులు చాట్ చేసినపుడు ఈ సంభాషణ అభ్యంతరకరంగా ఉండొద్దని కోర్టు పేర్కొంది. జీవిత భాగస్వామిపై మరొకరికి అభ్యంతరం ఉన్నప్పటికీ అలాంటి కార్యకలాపాలను అలాగే కొనసాగిస్తే అది నిస్సందేహంగా మానసిక క్రూరత్వం కిందకు వస్తుందని కోర్టు స్పష్టం చేసింది.తన భార్య వాట్సాప్ చాటింగ్ అసభ్యకరంగా ఉన్నాయని భర్త ఆరోపించాడు. అయితే ఆ ఆరోపణలను భార్య ఖండించింది. తన ఫోన్‌ను హ్యాక్ చేసి.. తనకు వ్యతిరేకంగా సాక్ష్యాలు సృష్టించేందుకు తన భర్తనే ఆ మెసేజ్‌లను ఇద్దరు ఫ్రెండ్స్‌కు పంపించాడని ఆరోపించింది. తన భర్త చేసిన పని.. తన ప్రైవసీకి భంగం కలిగించాయని ఆరోపించింది. అంతేకాకుండా తన భర్త రూ.25 లక్షల కట్నం డిమాండ్ చేశాడని ఆరోపణలు చేసింది. అయితే ఆ మహిళ తండ్రి కూడా తన కుమార్తె తన బాయ్‌ఫ్రెండ్‌తో మాట్లాడేదని చెప్పడంతో కింది కోర్టు మంజూరు చేసిన విడాకులను హైకోర్టు సమర్థించింది.

## పాక్ మహిళ వలపు వలలో పడి
## భారత రక్షణ రంగ రహస్యాలను లీక్ చేసిన ఉద్యోగి



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్ నుంచి కీలక రహస్యాలు.. ఆర్మీ, రక్షణ రంగానికి చెందిన సమాచారాన్ని సేకరించేందుకు దాయాది పాకిస్తాన్ అనేక ఎత్తులు వేస్తూ ఉంటుంది. పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ.. భారత్‌లోని పలువురికి మహిళలను ఎరగా వేసి.. వారి దగ్గరి నుంచి సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తూనే ఉంది. ఇప్పటివరకు ఎంతో మంది ఇలా దొరికిపోగా.. తాజాగా మరోసారి ఇలాంటి హనీ ట్రాప్ సంఘటన వెలుగులోకి వచ్చింది. పాక్ ఐఎస్ఐ కోసం పనిచేస్తున్న ఓ అమ్మాయి వలపు వలలో పడిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి.. మిలిటరీ రహస్యాలను లీక్ చేయడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ఆ వ్యక్తితో పాటు అతడి ఫ్రెండ్‌ను కూడా తాజాగా ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు.పాక్ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తూ.. భారత రక్షణ రంగానికి చెందిన రహస్య సమాచారాన్ని శత్రువులకు చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై ఉత్తర్‌ప్రదేశ్‌లో రవీంద్ర కుమార్ అనే వ్యక్తిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. పాక్ ఏజెంట్ హనీ ట్రాప్‌లో పడిన రవీంద్ర కుమార్.. భారత సైన్యం, ఆయుధాలకు సంబంధించిన కీలక డేటాతో పాటు గగన్‌యాన్ ప్రాజెక్ట్ వివరాలను కూడా పాక్‌కు చేరవేసినట్లు విచారణలో తేలింది. ఫిరోజాబాద్‌లోని హజ్రత్‌పూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మెకానిక్‌గా పనిచేస్తున్న రవీంద్ర కుమార్‌కు.. గతేడాది నేహా శర్మ అనే మహిళ ఫేస్‌బుక్‌లో పరిచయం అయింది. పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కోసం పనిచేస్తున్న నేహా శర్మ.. రవీంద్ర కుమార్‌తో స్నేహం చేసి.. డబ్బులు ఆశ చూపించి మిలిటరీ రహస్యాలను సంపాదించినట్లు పోలీసుల పేర్కొన్నారు.అయితే రవీంద్ర కుమార్ నేహా శర్మ ఫోన్ నంబర్‌ను చంద్రన్ స్టోర్‌కీపర్ పేరుతో సేవ్ చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా వాట్సాప్‌లో ఆమెకు అనేక కీలక డాక్యుమెంట్లు పంపించినట్లు తేల్చారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, 51 గోరా? రైఫిల్స్ రెజిమెంట్ అధికారులు చేపట్టిన లాజిస్టిక్స్ డ్రోన్ టెస్ట్‌లు, రోజువారీ ప్రొడక్షన్ డేటా, స్క్రీనింగ్ కమిటీ పంపిన రహస్య లేఖలను సంపాదించి.. పంపించినట్లు తెలిసింది. ఇక ఈ డేటాలో ఇస్రో చేపడుతున్న కీలక ప్రాజెక్ట్ అయిన గగన్‌యాన్ వివరాలు కూడా ఉన్నాయని పోలీసులు చెప్పడం ఇప్పుడు సంచలనంగా మారింది.ఇక రవీంద్ర కుమార్.. కేవలం నేహా శర్మతో మాత్రమే కాకుండా పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న ఐఎస్ఐ సభ్యులతోనూ నేరుగా కాంటాక్ట్‌లో ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. భారత రక్షణ రంగ ప్రాజెక్టులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని రవీంద్ర కుమార్.. పాక్ ఐఎస్ఐకి పంపించి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రవీంద్ర కుమార్‌తోపాటు అతడి ఫ్రెండ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని.. వారి వాట్సాప్ చాట్‌లను తనిఖీ చేస్తున్నారు.

## వ్యక్తిని కొట్టి విషం తాగించిన ప్రియురాలు, ఆమె సహచరులు



**లక్నో-నవభూమి:** సహజీవనం సమయంలో ఇచ్చిన నగదు, నగలు తిరిగి ఇవ్వాలని ప్రియురాలిని ఒక వ్యక్తి డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో తన స్నేహితులతో కలిసి అతడ్ని ఆమె కొట్టింది. బలవంతంగా విషం తాగించింది. దీంతో అస్వస్థతకు గురైన ఆ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని మహోబా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. హమీర్‌పూర్‌కు చెందిన శైలేంద్ర గుప్తా మహోబాలోని ప్రైవేట్ కంపెనీలో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల కిందట కాలిపహరి గ్రామానికి చెందిన ఒక మహిళతో అతడికి పరిచయం ఏర్పడింది. దీంతో ఈ జంట ఒక అద్దె ఇంట్లో కలిసి నివసించారు. కొంతకాలం వారిద్దరూ సహజీవనం చేశారు. ఆ సమయంలో విలువైన నగలు, నాలుగు లక్షల నగదు తన ప్రియురాలికి అతడు ఇచ్చాడు.కాగా, కొన్నేళ్ల తర్వాత ఆ మహిళకు మరో వ్యక్తి పరిచయమయ్యాడు. దీంతో శైలేంద్రకు ఆమె దూరంగా ఉండటంతో వారిద్దరూ విడిపోయారు. ఈ నేపథ్యంలో తాను ఇచ్చిన నగలు, నగదు తిరిగి ఇవ్వాలని శైలేంద్ర ఆమెను డిమాండ్ చేశాడు. దీని కోసం ఆ మహిళ నివసించే ఇంటికి వెళ్లాడు. ఈ సందర్భంగా తన సహచరులతో కలిసి ఆమె అతడ్ని కొట్టింది. అలాగే బలవంతంగా విష పదార్థాన్ని తాగించింది.మరోవైపు శైలేంద్ర తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో జిల్లా ఆసుపత్రికి అతడ్ని తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. డబ్బు, నగలు గురించి మరోసారి అడిగితే తప్పుడు కేసులో ఇరికిస్తామని ఆ మహిళ, ఆమె ఫ్రెండ్స్ తనను బెదిరించినట్లు శైలేంద్ర ఆరోపించాడని పోలీస్ అధికారి తెలిపారు. నిందితులను సదాబ్ బేగ్, దీపక్, హ్యాపీగా గుర్తించినట్లు చెప్పారు. ఆ ముగ్గురు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.



# మహేష్-రాజమౌళి మూవీ సెట్‌లో ప్రియాంక చోప్రా హోళి సెలబ్రేషన్స్



హోళి పండుగని దేశ వ్యాప్తంగా ప్రతి ఒక్కరు ఎంతో ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా అయితే ఏకంగా మహేష్-రాజమౌళి మూవీ సెట్‌లో హోళి సెలబ్రేషన్స్ జరుపుకోవడం విశేషం. ఎస్ఎస్ఎంబీ 29లో ప్రియాంక చోప్రా కథనాయిక కాగా, రీసెంట్‌గానే ఈ సినిమా కోసం ఇండియాకు వచ్చింది. ఒడిశాలో జరుగుతున్న కొత్త షెడ్యూల్‌కు వెళ్లింది. ఇక హోలీ అని, రాజమౌళి టీంతో కలిసి హోళి సెలబ్రేషన్స్ జరుపుకుంది. అందుకు సంబంధించి ప్రియాంక చోప్రా ఓ పోస్ట్ పెట్టింది. హోలీ రోజు కూడా మాకు వర్కింగ్ డే అని తన టీంతో హోలీని సెలెబ్రేట్ చేసుకున్న ఫోటోలను ప్రియాంక చోప్రా పంచుకుంది. హోలీ సందర్భంగా ప్రియాంక చోప్రా సోషల్ మీడియాలో తన సెలబ్రేషన్ ఫోటోలతో పాటు రంగులను సైతం ఫోటో తీసి షేర్ చేశారు. ఇవి ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రియాంక చోప్రా వేసిన పోస్ట్‌కు నమ్రత స్పందించడంతో అది మహేష్-రాజమౌళి మూవీ సెట్ అని అందరు ఫిక్స్ అయ్యారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఒరిస్సా రాష్ట్రంలోని కోరట్ పూర్ లో జరుగుతోంది. లేటెస్ట్ షెడ్యూల్ లో ప్రియాంక సైతం పాల్గొంటున్నారు. ఇటీవల ప్రియాంక భర్త, అమెరికన్ గాయకుడు నిక్ జోనస్ కూడా ఇండియా వచ్చిన విషయం తెలిసిందే. ప్రియాంక తమ్ముడు సిద్ధార్థ పెళ్లి కోసం నిక్ ఫ్యామిలీ ఇండియాకి రాగా, వారందరితో కలిసి ప్రియాంక చోప్రా తెగ సందడి చేసింది. అందుకు సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ అయ్యాయి.



# అందాల పూజ ఎర్ర గులాబీ

టాలీవుడ్‌లో ఒక లైలా కోసం, ముకుంద సినిమాలతో అడుగు పెట్టిన పూజా హెగ్డే పెద్దగా గుర్తింపు సొంతం చేసుకోలేక పోయింది. ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోక పోవడంతో బాలీవుడ్‌కి వెళ్లింది. అక్కడ మొహెంజదారో సినిమాలో నటించింది. ఆ సినిమా తర్వాత మళ్లీ టాలీవుడ్‌లో అల్లు అర్జున్ హీరోగా వచ్చిన దువ్వాడ జగన్నాథం సినిమాలో నటించింది. ఆ సినిమాలో పూజా హెగ్డే గ్లామర్‌తో మెప్పించింది. అంతే కాకుండా నటనతో సరికొత్తగా కనిపించింది. అందుకే టాలీవుడ్‌లో దువ్వాడ జగన్నాథం తర్వాత వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం రాలేదు. దాదాపుగా ఐదేళ్ల పాటు టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా సినిమాలు చేసింది. పూజా హెగ్డే తక్కువ సమయంలోనే టాలీవుడ్ స్టార్ హీరోలు అల్లు అర్జున్, రామ్ చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్, మహేష్ బాబు, వరుణ్ తేజ్, అఖిల్‌లతో వర్క్ చేసే అవకాశాలు దక్కించుకుంది. ఆ క్రమంలో భారీ విజయాలను కూడా సొంతం చేసుకుంది. కానీ ఈమధ్య కాలంలో పూజా హెగ్డేకి కాలం కలిసి రావడం లేదు. ఆమె నటించిన ఏ ఒక్క సినిమా బాక్సాఫీస్ వద్ద ఆడలేదు. దాంతో గత రెండు సంవత్సరాలుగా టాలీవుడ్‌కి దూరంగా ఉంది. ముఖ్యంగా ప్రభాస్‌తో నటించిన రాధేశ్యామ్ సినిమా తర్వాత పూజా హెగ్డే ఇండస్ట్రీలో కనిపించకుండా పోయింది. ప్రస్తుతం బాలీవుడ్, కోలీవుడ్‌లో సినిమాలు చేస్తున్న ఈమె అక్కడ హిట్ కోసం ప్రయత్నాలు చేస్తుంది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా పూజా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా పూజా హెగ్డే రెడ్ డ్రెస్‌లో విభిన్నమైన లుక్‌తో ఆకట్టుకుంది. ఎర్ర గులాబీలతో తయారు చేసిన అందమైన డ్రెస్‌ను ధరించినట్లుగా పూజా హెగ్డే ఔట్ ఫిట్ ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి లుక్‌తో పూజా హెగ్డే సర్‌ప్రైజ్ చేసింది. పెద్దగా స్కిన్ షో చేయకుండానే పూజా హెగ్డే చూపు తిప్పనివ్వడం లేదు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంతటి అందం ఉన్న పూజా హెగ్డేను అప్పుడే టాలీవుడ్ పక్కన పెట్టడం బాధగా ఉందని, త్వరలో ఆమె తిరిగి టాలీవుడ్‌లో రీ ఎంట్రీ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు. మంచు విష్ణు బాలీవుడ్‌లో ఇటీవల దేవ సినిమాతో వచ్చి నిరాశ పరిచింది. అక్కడ దేవ హిట్ అయితే కచ్చితంగా మంచి ఫ్యూచర్ ఉంటుందని అనుకున్నారు. కానీ దేవ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడింది. అందుకే హిట్ కోసం మరో సినిమా వచ్చే వరకు ఈ అమ్మడు వెయిట్ చేయాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఈ అమ్మడు రెండు సినిమాలు చేస్తుంది. మరో వైపు తమిళ్‌లోనూ ఈమె సినిమాలు చేస్తుంది. ముఖ్యంగా తమిళ్‌లో ఈమె సూర్యతో కలిసి చేస్తున్న రెట్రో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. రెట్రో సినిమాకు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా హిట్ అయితే తమిళ్‌లో రెండు మూడు ఏళ్ల పాటు బిజీగా ఉండే అవకాశాలు ఉంటాయి. రెట్రో మాత్రమే కాకుండా సూపర్ స్టార్ రజనీకాంత్ కూలీ సినిమాలో ఈమె ఐటెం సాంగ్‌లో కనిపించబోతుంది. ఇక లారెన్స్ సినిమా కాంచన 4 లోనూ ఈమెను ఎంపిక చేశారనే వార్తలు వచ్చాయి. ఇక సూపర్ స్టార్ విజయ్‌తో చేస్తున్న జన నాయగన్ సినిమా విడుదలకు సిద్ధం

# అరువు గొంతు కాదు అసలు గొంతే!



ముంబై బ్యూటీ పూజాహెగ్డే మళ్లీ బౌన్స్ బ్యాక్ అయ్యే పనిలో ఉన్న సంగతి తెలిసిందే. సౌత్ లో మళ్లీ అవకాశాలతో బిజీ అవుతోంది. కోలీవుడ్ , టాలీవుడ్ లో అవకాశాలు అందుకుంటోంది. ప్రస్తుతం సూర్యతో రెట్రో విజయ్ 69వ చిత్రం జన నాయగన్‌కాంచన-4లో నటిస్తోంది. అలాగూ కూలీ చిత్రంలో ఐటం భామగాను అలరించబోతుంది. ఇవన్నీ సక్సెస్ అయితే పూజాహెగ్డేకి తిరుగుండదు. మళ్లీ మునుపటిలా బిజీ అయిపోతుంది. సక్సెస్ కోసం అమ్మడు చేతిలో ఉన్న ఏ ఒక్క అవకాశం వదులు కోవడం లేదు. నిరంతర శ్రమ జీవిగా మారుతుంది. ఇంత వరకూ డబ్బింగ్ విషయంలో ఇతర ఆర్టిస్టులపై ఆధారపడిన అమ్మడు తొలిసారి సొంత గాత్రం వినిపించ డానికి రెడీ అవుతోంది. రెట్రో సినిమా కోసం తానే స్వయంగా డబ్బింగ్ చెబుతుందిట. దీనిలో భాగంగా అమ్మడు ట్రైనర్ సమక్షంలో తమిళ్ నేర్చుకుం టుంది. ఇతర సినిమా షూటింగ్ లలో పాల్గొంటూనే ఖాళీ సమయంలో తమిళ్ ప్రాక్టీస్ పై దృష్టి పెడుతుంది. ట్రైనింగ్ సహా భాషపై పట్టు రాగానే పూజాహెగ్డే డబ్బింగ్ పనులు మొదలు పెడుతుందని సమాచారం. రెట్రోకి డబ్బింగ్ సెట్ అయితే గనుక లైన్ లో ఉన్న మిగతా చిత్రాలకు తానే డబ్బింగ్ చెప్పే అవకా శాలున్నాయి. డబ్బింగ్ చెప్పడం పై పూజాహెగ్డే సంతోషాన్ని వ్యక్తం చేసింది. తమిళ్ లోనే కాకుండా ఇతర భాషల చిత్రాల్లో కూడా తానే స్వయంగా డబ్బింగ్ చెబుతానని తెలిపింది. కీర్తి సురేష్, రష్మికా మందన్నా లాంటి వారు సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవడం ప్రొఫెషనల్ గా వాళ్లకు ఎంతో కలిసొచ్చింది. వాళ్ల పాత్రలకు వాళ్లే డబ్బింగ్ చెప్పడంతో తెరపై పాత్రలు పండటానికి ఎంతో ఆస్కారం ఉంటుంది. ఆ విషయంలో పూజాహెగ్డే కాస్త ఆలస్యం చేసింది

# రేసింగ్ ట్రాక్‌పై నాగ చైతన్య, శోభిత క్యూట్ లుక్స్..



ప్రస్తుతం టాలీవుడ్ క్యూట్ కపుల్స్ లో నాగ చైతన్య, శోభిత జంట ఒకటి. సమంత నుండి విడిపోయాక నాగ చైతన్య కొన్ని నెలల పాటు శోభితతో ప్రేమాయణం నడిపి గత ఏడాది వివాహం చేసుకున్నాడు. ఇక పెళ్ళైనప్పటి నుండి వీరిద్దరు చాలా సరదాగా గడుపుతున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్ రోల్ పోషించే శోభిత ఎప్పటికప్పుడు వాటికి సంబంధించిన ఫోటోస్ షేర్ చేయడంతో వైరల్ అయ్యాయి. ఈ జంట ఆమ్‌స్టర్‌డామ్ , మెక్సికోలలో వీధి వీధి తిరుగుతూ సరదాగా ఎంజాయ్ చేశారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ నుండి సాయంత్రం వరకు ఎలా గడిపారో ఫోటోల ద్వారా తన అభిమానులకు తెలియజేసింది.

అయితే తాజాగా ఈ జంట రేసింగ్ ట్రాక్‌పై సందడి చేసింది. తండేల్ సక్సెస్ తర్వాత నాగచైతన్య, శోభిత దంపతులు హాలిడే ట్రిప్ ఎంజాయ్ చేస్తుండగా, ఈ క్రమంలోనే కార్ రేసింగ్ ట్రాక్ వద్ద తమ దేను సరదాగా గడిపారు. చై, శోభిత కలిసి రేసింగ్ ట్రాక్‌లో గడిపిన క్షణాలను శోభిత సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. కాగా, చైతన్యకి రేసింగ్ అంటే చాలా ఇష్టం . అందుకే శోభితను సైతం అక్కడకు తీసుకెళ్లారు. ఆమెతో సరాదాగా రేసింగ్ కారు నడిపారు. అంతే కాదండోయ్.. నాగ చైతన్య తనకు ఇష్టమైన రేసింగ్ కారులో శోభితను కూర్చోబెట్టి ఫోటోలు దిగగా, ఇవి నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక ఇటీవలే ఈ కపుల్ యూరప్ ట్రిప్ ఎంజాయ్ చేశారు. తేదాది డిసెంబర్ 4న హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో శోభిత మెడలో మూడు ముళ్లు వేశాడు నాగ చైతన్య. ఓ ఇంటర్వ్యూలో ఆమెతో జీవితాన్ని పంచుకోవడం చాలా ఆనందంగా ఉందని.. తనతో అన్ని విషయాలు పంచుకుంటానని, ఎప్పుడైనా కన్‌ఫ్యూజ్ అయితే వెంటనే ఆమె సలహా తీసుకుంటానని నాగ చైతన్య స్పష్టం చేశారు. తండేల్ సక్సెస్ జోష్ లో ఉన్న నాగ చైతన్య ఇప్పుడు చాలా జోష్‌తో కనిపిస్తున్నారు. భార్య శోభితని తీసుకొని పలు ప్రాంతాలకి తిరుగుతున్నాడు. ఈ కొత్త జంటను ఇలా చూసి అక్కినేని ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. క్యూట్ కపుల్ ఎంజాయ్ చేయండి అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# రిటైర్మెంటేనా? ఆ రెండు రిలీజ్ అయిన తర్వాత



పవన్ కళ్యా ణ్ సిని మాల్లోకి రావాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ అతడి ఎంట్రీ అనుకోకుండా జరిగి పోయింది. అనుకోకుండానే పెద్ద స్టార్ అయిపోయారు. సెలబ్రిటీ లైఫ్ ఆస్వాదిస్తాడని ఆయన ఊహకి ఏనాడు రాలేదు. సాధారణ జీవితాన్ని గడపాలనుకున్నారు. కానీ కాలం ఆయన్ని అక్కడితో ఆగి పోనివ్వలేదు. స్టార్ అయిన తర్వాత రాజకీయాల్లోకి కూడా అనుకోకుండానే వచ్చారు. ప్రజారాజ్యంతో మొదలైన అతడి రాజకీయ ప్రస్థానం జనసేన పార్టీ నిర్మించడం....నేడు డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నెరవర్తించడం వరకూ వచ్చింది. మరి రాజకీయం? సినిమా? రెండు రంగాల్లో పవన్ ఎక్కువగా ఇష్టపడేది ఏది? అంటే ప్రస్తుతానికి ఆయన మనసంతా రాజకీయంపైనే ఉందన్నది సుస్పష్టం. ప్రజలకు సేవ చేయాలని ఆయన తపిస్తోన్న విధానం చూస్తుంటే అర్దమవుతుంది. అయినా సరే తప్పని పరిస్థితుల్లో సినిమాలు చేయాల్సి వస్తోంది తన పార్టీ కోసమా? వ్యక్తిగత అవసరాల కోసమా? అన్నది పక్కనబెడితే ఇకపై ఆయన సినిమాలు చేసే అవకాశాలైతే చాలా తక్కువగానే ఉన్నాయని విశ్లేషణలకు తెరపైకి వస్తున్నాయి. కమిట్ అయిన సినిమాలే పూర్తి చేయలేని పరిస్థితి. ఓజీ-హరిహర వీరమల్లు సంవత్సరాలుగా సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. అవి ఎప్పుడు రిలీజ్ అవుతాయో కూడా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. మరి ఇలాంటి పరిణామాల్లో పవన్ కొత్త సినిమాలు చేసే అవకాశం ఎంత మాత్రం ఉండదని ...రానున్న రోజుల్లో ఆయన రాజకీయంగా మరింత బిజీ అవుతారని అంటు న్నారు. పైగా వచ్చే ఎన్ని కల్లో పవన్ ఎలాంటి మద్దతు లేకుండా బరిలోకి దిగాలంటే పార్టీని ఇప్పటి నుంచే మరింత బలోపేతం చేయాలి. అలా చేయగలిగితేనే రాజకీ యంగా భవిష్యత్. ఇలాంటి పరిస్థి తుల నేపథ్యంలో పవన్ ఓజీ, వీరమల్లు తర్వాత కొత్త సినిమాలేవి చేసే అవకాశం లేదంటున్నారు.

# నితీశ్ కుమార్ రెడ్డి ఫుల్ ఫిట్.. సన్‌రైజర్స్‌తో కలవనున్న ఆల్‌రౌండర్



**బెంగుళూరు-నవభూమి** ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఫిట్‌నెస్ పరీక్షలో క్లియర్ అయినట్లు తెలుస్తోంది. వెన్ను నొప్పితో బాధపడుతున్న నితీశ్.. ఫుల్ ఫిట్ అయినట్లు ఓ రిపోర్టు ద్వారా వెల్లడైంది. అయితే త్వరలోనే అతను హైదరాబాద్ సన్‌రైజర్స్ జట్టుతో కలవనున్నట్లు కూడా వార్తలు అందుతున్నాయి. క్రికెటర్ నితీశ్ ఇటీవల జరిగిన ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లో అద్భుతంగా రాణించిన విషయం తెలిసిందే. అయితే ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ సమయంలో అతను గాయానికి గురయ్యాడు. ఫిట్‌నెస్‌కు చెందిన అన్ని రొటీన్ పరీక్షలను నితీశ్ రెడ్డి క్లియర్ చేసినట్లు తెలుస్తోంది. యో-యో టెస్టులో కూడా అతను పాసైనట్లు రిపోర్టు ఉంది. బెంగుళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నితీశ్ .. కోలుకుంటున్నాడు. ఫిజియో అతనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఇంగ్లండ్‌తో తొలి టీ20 మ్యాచ్‌లో ఆడినా.. దాంట్లో అతను బౌలింగ్ కానీ, బ్యాటింగ్ కానీ చేయలేదు. ఐపీఎల్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ జట్టు .. నితీశ్ రెడ్డిని 6 కోట్లకు ఖరీదు చేసింది. గత సీజన్‌లో అతను 13 మ్యాచుల్లో 303 రన్స్ చేశాడు. అతని స్ట్రయిక్ రేట్ 143గా ఉంది. ఆస్ట్రేలియా సిరీస్‌లో అతను తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. మెల్‌బోర్న్ టెస్టులో విరోచితంగా 114 రన్స్ చేశాడు. సన్‌రైజర్స్ జట్టు తన తొలి మ్యాచ్‌ను మార్చి 23వ తేదీన రాజస్థాన్ రాయల్స్‌తో హైదరాబాద్‌లో ఆడనున్నది.

# లక్నో రాత మారేనా?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఆగమనమే ఓ సంచలనం. 2022లో లక్నో ఫ్రాంచైజీని ప్రముఖ వ్యాపారవేత్త సంజీవ్ గొయెంకా ఏకంగా రూ. 7,090 కోట్లతో సొంతం చేసుకుని అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. భారీ మొత్తానికి తగ్గట్టుగానే లక్నో కూడా తొలి రెండు సీజన్లలో అంచనాలకు మించి రాణించింది. బంతిని బలంగా బాదే నికోలస్ పూరన్, మార్కస్ స్టోయినిస్ వంటి హార్డ్ హిట్టర్లు.. మాజీ సారథి కేఎల్ రాహుల్, క్వింటన్ డికాక్ నిలకడైన ఆటతీరు.. అయూష్ బదోని, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, కృనాల్ పాండ్యా, మోహ్సిన్ ఖాన్, మయాంక్ యాదవ్ వంటి వర్ధమాన క్రికెటర్ల మెరుపులతో ఆ జట్టు వరుసగా 2022, 2023 సీజన్లలో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించి మూడో స్థానంలో నిలిచింది. కానీ 2024లో మాత్రం తడబాటుకు గురై ఏడో స్థానంతో ముగించింది. తమతో పాటే లీగ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన గుజరాత్.. 2022లో టైటిల్ గెలవడంతో పాటు 2023లో ఫైనల్ చేరినా లక్నో మాత్రం రెండు సీజన్లలో టైటిల్‌కు దగ్గరగా వచ్చినా ఆ ముచ్చటను తీర్చుకోలేకపోయింది. ఈ సీజన్‌లో కొత్త కెప్టెన్ రిషభ్ పంత్ సారథ్యంలో బరిలోకి దిగనున్న లక్నో.. నాలుగో ప్రయత్నంలో అయినా కప్పు కలను నెరవేర్చుకుంటుందేమో చూడాలి.

నవక్రీడ

# కొత్త బిజినెస్ స్టార్ట్ చేసిన అయ్యర్.. వాళ్లే టార్గెట్‌గా..



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా స్టార్లకు మంచి ఫ్యాషన్ సెన్స్ ఉంది. ఇది వాళ్లు ధరించే బట్టలు, వాచ్‌లు, క్యాప్స్ లాంటి వాటిని చూసి చెప్పొచ్చు. ముఖ్యంగా విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ లాంటి వాళ్లు ఎప్పటకప్పుడు ట్రెండ్ సెట్ చేస్తుంటారు. డిఫరెంట్ క్లోత్స్‌తో ఫ్యాన్స్‌ను సర్‌ప్రైజ్ చేస్తుంటారు. ఇక్కడితో వాళ్లు ఆగిపోలేదు.. దీన్నే బిజినెస్ ఐడియా గానూ మార్చుకున్నారు. ఇప్పటికే కోహ్లీ క్లోత్ బిజినెస్‌లోకి అడుగుపెట్టాడు. తాజాగా అయ్యర్ కూడా కొత్త వ్యాపారం మొదలుపెట్టాడు. అతడు స్టార్ట్ చేసిన బిజినెస్ ఏంటనేది ఇప్పుడు చూద్దాం..అదే లక్ష్యంగా..క్లోతింగ్ బిజినెస్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు అయ్యర్. హ్యూమన్ అనే కంపెనీతో కొలాబొరేట్ అయ్యాడీ స్టార్ బ్యాటర్. కొత్త ఫ్యాషన్ కలెక్షన్‌ను యూత్‌కు పరిచయం చేయడమే టార్గెట్‌గా తాము ఒక్కటయ్యామని హ్యూమన్-అయ్యర్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఫ్యాషన్, పర్సనల్ ఎక్స్‌ప్రెషన్ ఉట్టిపడేలా తమ ఉత్పత్తులు ఉంటాయని హ్యూమన్ సంస్థకు చెందిన ప్రణవ్ మిశ్రా తెలిపారు. ఎంతో ఇష్టం..హ్యూ మన్-అయ్యర్ భాగస్వామ్యంలో రూపొందు తున్న దుస్తుల్లో టీషర్ట్స్‌తో పాటు షర్ట్స్, బాటమ్స్ ఉంటాయని ప్రణవ్ పేర్కొన్నారు. యూత్‌కు నచ్చేలా స్ట్రీట్ ఫ్యాషన్ ఉట్టిపడేలా వీటిని డిజైన్ చేశామన్నారు. 'ఇదో అద్భుతమైన అనుభవం. ఫ్యాషన్ అంటే ముందు నుంచి నాకు ఇష్టం. హ్యూమన్ టీమ్‌తో కలసి పని చేయడం వల్ల ఫ్యాషన్‌ను మరింతగా అర్థం చేసుకున్నా. ప్రతి చిన్న విషయాన్ని వాళ్లు లోతుగా అధ్యయనం చేస్తారు.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**